ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ఆక్రమణలపై కొరడా

- వైసీపీ భూకుంభకోణాలు బట్టబయలు
- కలెక్టర్ శ్రీధర్ ప్రత్యేక ఆపరేషన్
- 700 ఎకరాలు కబ్జాకు గురైనట్లు ప్రాథమిక అంచనా
- జేసీ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- ఇప్పటికే వంద ఎకరాలు స్వాధీనం
- ఆక్రమణదారుల గుండెల్లో గుబులు

రాష్ట్ర, జిల్లా చరిత్రలో జగన్ పాలన ఓ అధ్యాయం. ఆయన హయాంలో అన్ని వ్యవస్థలు దాదాపు నిర్వీర్యమైపోయాయి. ఇక జిల్లా విషయానికొస్తే అప్పట్లో ఆయనే సీఎం కావడంతో అధికార యంత్రాంగం మిన్నకుండిపోయింది. అంతే.. గతంలో ఎప్పుడూ లేని విధంగా వైసీపీ అండ్ కో రెచ్చిపోయింది. ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు నేతలు గద్దల్లా వాలిపోయి స్వాహా చేశారు. మనల్ని ఎవర్రా అడిగేదని విర్రవీగిపోయారు. సీన్ కట్‌చేస్తే.. చంద్రబాబు సర్కారు అధికారంలోకి రావడంతో పరిస్థితి మారిపోయింది. భూకబ్జాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉండడంతో కలెక్టరు చెరుకూరి శ్రీధర్ ఆక్రమణదారులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 3 వేల ఎకరాలకు పైగా ఆక్రమణ జరిగినట్లు తెలిసింది. అందులో 700 ఎకరాలు కబ్జాకు గురైనట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఇప్పటికే జేసీ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసి దాదాపు వంద ఎకరాలు స్వాధీనం చేసుకోవడంతో ఆక్రమణదారుల గుండెల్లో గుబులు రేగుతోంది.



కాశినాయన మండలంలో ఆక్రమణకు గురైన భూములు ఇవే..

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైసీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ భూముల ఆక్రమణ సాగింది. దివంగత వైఎస్ హయాంలో కూడా ప్రభుత్వ భూముల పంపిణీలో పార్టీ సానుభూతిపరులకు ఆయన ప్రియార్టీ ఇచ్చేవారు అంటారు. అయితే జగన్ హయాంలో ప్రభుత్వ భూమి అంటే అది తమదే అన్నట్లుగా వైసీపీ నేతలు ఫీల్ అయ్యారు. అది ప్రైవేటా, ప్రభుత్వ భూమినా అని చూడలేదు. కనిపించిందల్లా స్వాహా చేసేశారు. అందుకు రెవెన్యూ యంత్రాంగం కూడా సహకరించింది. కడప నగర సమీపంలోని సీకేదిన్నె, వీఎన్‌పల్లె, చక్రాయపేట, కమలాపురం, వల్లూరు, చెన్నూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, ఖాజీపేట, బి.మఠం, అట్లూరు, బద్వేలు, కాశినాయన, కలసపాడు, బి.కోడూరు, గోపవరం, పోరుమామిళ్ల, పులివెందుల మరికొన్ని చోట్ల భూకబ్జాలు ఎక్కువగా జరిగాయి. ఏకంగా రెవెన్యూ కార్యాలయాల్లో ట్యాంపరింగ్ చేసి మరీ ప్రైవేటు ఆస్తులను సైతం ఆక్రమించారు.

కడప నగర శివారులోని సీకేదిన్నెలో కోట్లు విలువ చేసే ఆస్తులున్నాయి. అయితే ఇక్కడ కడప, కమలాపురం చెందిన ఇటు టీడీపీ, అటు వైసీపీ నేతలు కోట్లాది రూపాయలు విలువ చేసే వాగులు, వంకలు, రైల్వే భూములు, బుగ్గవంక భూములు కూడా కొట్టేశారు. ఇక్కడ అన్నీ వెంచర్లు వేయగా సీకేదిన్నె రెవెన్యూ పొలంలో సజ్జల రామకృష్ణారెడ్డి కుటుంబం 63 ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమించి సామ్రాజ్యాన్ని నిర్మించుకుంది. కడప సిటీ ఇటు కడప, అటు కమలాపురం నియోజకవర్గం, రాజంపేట నియోజకవర్గంలోని సీకేదిన్నె, వల్లూరు, చెన్నూరు, సిద్దవటం మండలాలు వస్తాయి. అంటే కడప చుట్టూ రెండు నియోజకవర్గాలు ఉంటాయి. అయితే ఇక్కడే భూకబ్జాలు బాగా జరిగాయి. సీకేదిన్నె, వల్లూరు, చెన్నూరు పరిధిలో కడప, కమలాపురం చెందిన కొందరు ప్రభుత్వ భూములతో పాటు వాగులు, వంకలు అటవీశాఖ భూములు ఆక్రమించారని చెబుతారు. అదే సమయంలో ప్రైవేటు ఆస్తులు కూడా కొట్టేశారని సమాచారం. ఇక్కడ భూస్కామ్‌లు వంద కోట్లు ఉండవచ్చని చెబుతారు. ఇక కడప-రేణిగుంట రోడ్డులోని సిద్దవటం, ఒంటిమిట్టలో కూడా కనీసం రూ.50 కోట్లకు పైగా విలువ చేసే భూములు ఆక్రమణకు గురయ్యాయి. వీటిని టీడీపీ, వైసీపీ నేతలు ఆక్రమించుకోవడం గమనార్హం. ఎన్నికల తరువాత కూడా కొందరు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చి భూములు కాపాడుతామని హామీలు తీసుకున్నట్లు చెబుతారు.

ప్రభుత్వ భూములు తిరిగి స్వాధీనం

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భూములు సుమారు 3300 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు కలెక్టర్ గుర్తించారు. అన్యాక్రాంత భూముల స్వాధీనం కోసం కలెక్టరు చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్ ఆ పరిధిలోని ఆర్డీవో, లీగల్ అడ్వైజర్, ఫారెస్టు, ఇతరులు కలిసి ఓ టీంను ఏర్పాటు చేశారు. ఫిర్యాదు వస్తే చాలు ఈ టీం అటాక్ చేస్తోంది. జిల్లాలో భూఆక్రమణదారులకు సీకేదిన్నె, కడప, సిద్దవటం, ఒంటిమిట్ట, వల్లూరు, వీఎన్‌పల్లె, చక్రాయపేట, తొండూరు పులివెందుల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు. పోరుమామిళ్ల, గోపవరం, బద్వేలు, అట్లూరు, ఖాజీపేట, మైదుకూరు, రాజుపాలెంలో భూ ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ దాదాపు ప్రభుత్వ, ప్రైవేటు భూములు ఆక్రమించారు. అయితే కలెక్టరు శ్రీధర్ వీటిపై దృష్టి సారించారు. ఫిర్యాదులు ఇతరత్రా వాటిలో 700 ఎకరాల భూములు ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. ఇప్పటికే ఇక్కడ జేసీ నేతృత్వంలో ప్రత్యేక టీం సర్వే చేసి భూ ఆక్రమణలను గుర్తిస్తోంది. అయితే ఆక్రమణదారులు ప్రభుత్వ భూములు ఆక్రమించి పండ్లతోటలు, ఫాంహౌస్‌లు సాగుచేయడం, కొందరు ఏకంగా ఆ భూములు సొంత ఆస్తులుగా అమ్ముకోవడం గమనార్హం. ఆ భూములు కూడా పరిశీలించి అక్కడ ఉన్న పండ్లతోటల సాగు, అమ్మిన వివరాలు పరిశీలిస్తే అన్నీ కొండలు, వాగులు, వంకలు ఉండడం గమనార్హం.

బి.కోడూరు మండలంలోని మున్నెల్లి రెవెన్యూ పొలంలో సర్వే నెం.1635-1 నుంచి 2736 వరకు అంతా అటవీశాఖ భూములు, కుంటలు తదితరాలు ఉన్నట్లు తెలుస్తోంది. సర్వే నెం.22లో నది ఉండగా మిగతా వాటిల్లో 20 ఎకరాలు భూములున్నాయి. కలసపాడు మండలంలోని శంకవరం రెవెన్యూ పొలంలో సర్వే నెం.2693 నుంచి 2696 వరకు డాట్ ల్యాండ్, 2662లో అటవీ, 2663లో కొండ, 2665లో చుక్కల భూమి, 2692/6 నుంచి కొండ, ఇతరత్రా భూములున్నాయి. అయితే కలసపాడు, బి.కోడూరు మండలాల్లో ఇప్పటికే ఆక్రమితమైన ప్రభుత్వ భూములు సుమారు వంద ఎకరాల దాకా గుర్తించారు. వీటన్నింటినీ స్వాధీనం చేసుకోనున్నారు.

ప్రభుత్వ భూముల కబ్జాపై సమాచారం ఇవ్వండి..



భూకబ్జాలపై సీఎం చంద్రబాబునాయుడు చాలా సీరియస్‌గా ఉన్నారు. భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లాలో 700 ఎకరాల భూములు ఆక్రమించినట్లు ప్రాథమికంగా గుర్తించాం. సుమారు వంద ఎకరాలు స్వాధీనం చేసుకున్నాం. ఎవరైనా సరే ప్రభుత్వ భూములు, వాగులు వంకలు ఆక్రమిస్తే నేరుగా ఫిర్యాదు చేస్తే ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచుతాం.

- చెరుకూరి శ్రీధర్, కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వేసవిలో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి కొరత రాకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత నీటి పారుదల ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని రానున్న రెండు నెలలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా కడప నగరానికి తాగునీటి అవసరాలకు మైలవరం ప్రాజెక్టు ద్వారా ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేసి పొదుపుగా వాడుకొనే చర్యలు చేపట్టాలన్నారు. పులివెందుల మున్సిపాలిటీలోని అన్ని ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా తాగునీటి సదుపాయం, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేయాలని సూచించారు. మే నెల నాటికి పులివెందుల పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సంవృద్ధిగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేసి ప్రారంభోత్సవం చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇంకా ఏవైనా అవసరమైతే ప్రతిపాదనలు అందజేసి త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అధిక నీటిఎద్దడి పరిస్థితులు లేకపోయినప్పటికీ ముదస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ప్రణాళికలు రూపొందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరిగ్ అధికారులకు తెలిపారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి పులివెందుల మున్సిపాలిటీకి పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, పబ్లిక్ హెల్త్ అధికారులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలి

- డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నాగరాజు



నగరంలో మానవహారం, ర్యాలీలో వైద్యసిబ్బంది, విద్యార్థులు

కడప కలెక్టరేట్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాను మలేరియా రహిత జిల్లాగా చేయడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ నాగరాజు అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇచ్చిన నినాదాలతో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం అండ్‌హెచ్‌వో మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే జిల్లాలో మలేరియా కేసులు తగ్గుముఖం పట్టాయని, మార్చి 2027 నాటికి మలేరియా కేసులు జీరో శాతానికి చేర్చాలని కోరారు. 2024లో కేవలం 15 మలేరియా కేసులు మాత్రమే నమోదు కాగా, 2025లో కేవలం ఒక కేసు నమోదైందన్నారు. మన జిల్లాలో మలేరియా కేసులు ఎక్కువగా పెద్దముడియం, వద్దిరాల, జమ్మలమడుగు, మైలవరం ప్రాంతాలను హాట్‌స్పాట్‌లుగా గుర్తించామని, ప్రతి శుక్రవారం డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాలను విస్తృతం చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికే నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో లార్వా వృద్ధి చెందకుండా గంబూజియా చేపలు 4 లక్షల వరకు వేశామని తెలిపారు. విద్యార్థుల్లో మలేరియా వ్యాధిపై అవగాహన కోసం చిత్రలేఖన, ఉపన్యాస మౌఖిక పరీక్షలు నిర్వహించి విజేతలకు బహుమతులు కూడా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ మహేశ్వరకుమార్, జిల్లా మలేరియా అధికారి మనోరమ, డీఎల్‌పీవో విజయభాస్కర్, ఎస్.ఓ.రమేష్‌రెడ్డి, ఏఎంఓ వెంకటరెడ్డి తదితర అధికారులు, వైద్యసిబ్బంది, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

కడప క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే నిర్వహిస్తున్నామని ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసుస్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది బదిలీలు, వ్యక్తిగత స్పౌస్, చిల్డ్రన్స్ మెడికల్ సమస్యల గురించి ఎస్పీకి సిబ్బంది స్వయంగా విన్నవించారు. కాగా ఎస్పీ వారి సమస్యలను విని వీలైనంత త్వరగా తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత అధికారులను ఆదేశించారు.



కానిస్టేబుల్ సమస్యలు వింటున్న ఎస్పీ అశోక్‌కుమార్

చెన్నకేశవుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



వైద్యనాథేశ్వరాలయంలో అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు కామాక్షి సమేత వైద్యనాథేశ్వర, రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవ దేవస్థానంలో సాయం సంధ్యవేళల్లో అంకురార్పణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ క్రమంలో మేళతాళాలతో పుట్టమన్ను తీసుకుని వచ్చి భూదేవి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నవధాన్యాలు, రకరకాల పంచపాలికలతో నిక్షిప్తం చేసి అఖండ దీపారాధనలు వెలిగించి బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆ శివకేశవులు ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

కడపరూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలో మే 10న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను జూలై 5కు వాయిదా వేసినట్లు డీఎల్ఎస్ఏ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మార్పును కక్షిదారులు, న్యాయవాదులు, సంబంధిత శాఖల అధికారులు గమనించాలని తెలిపారు.

సర్వర్ సమస్య

- అప్‌లోడ్‌కాని పింఛనుదార్ల వివరాలు
- అన్నమయ్య జిల్లాలో 3316 మంది
- కడప జిల్లాలో 3585 మంది అర్హులు

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్య పింఛను తీసుకుంటూ మరణించిన భర్తలకు బదులుగా వారి భార్యలకు వితంతు పింఛను మంజూరు చేసేందుకు ప్రభుత్వం కొత్తగా తెచ్చిన విధానం తొలిరోజు సర్వర్ సమస్య కారణంగా వివరాలు అప్‌లోడ్ చేయడానికి సాధ్యపడలేదు. గతంలో కుటుంబంలో వృద్ధాప్య పింఛను పొందుతూ మరణిస్తే అదే కుటుంబంలోని అతడి భార్యకు వితంతు పింఛను మంజూరు కావడానికి ఏళ్ల కాలం పట్టేది. ప్రస్తుత ప్రభుత్వం ఈ విధానానికి స్వస్తి పలికి వృద్ధాప్య పింఛనుదారుడు మరణిస్తే ఆ మరుసటి నెల నుంచి అతడి భార్యకు పింఛను మంజూరయ్యే ప్రక్రియను అమలు చేసేందుకు పూనుకుంది. దీనికనువుగా ఇప్పటికే ఏడాదికి పైగా పేరుకుపోయిన ఇలాంటి పింఛన్లన్నిటికీ ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం ఆదేశించింది. దీని ప్రకారం 2023 డిసెంబరు నుంచి 2024 అక్టోబరు మధ్యలో చనిపోయిన వృద్ధాప్య పింఛనుదార్ల జాబితాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. వీరందరికీ మే 1వ తేదీ పింఛన్లు పంపిణీ చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో శుక్రవారం నుంచి ఈ ప్రతిపాదనలు అప్‌లోడ్ చేయాల్సి ఉండగా ఉదయం నుంచి సర్వర్లు మొరాయించడంతో ప్రతిపాదనలన్నీ ఎక్కడివక్కడే ఆగిపోయాయి. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ మొత్తం 89,778 మందిని అర్హులుగా తేల్చి ఆ మేరకు గ్రామ, వార్డు సచివాలయాలకు పంపారు. అన్నమయ్య జిల్లాలో 3316 మంది, కడప జిల్లాలో 3585 మంది అర్హులుగా ఉన్నారు. సచివాలయాల్లోని వెల్ఫేర్ అసిస్టెంట్లు రోజంతా ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఇక కేవలం ఐదు రోజులు కూడా గడువు లేకపోవడంతో మే నెలలో కొత్త వితంతు పింఛన్లు మంజూరవుతాయా లేదా అని అర్హుల్లో ఆందోళన నెలకొంది.



ముష్కరులను బహిరంగంగా ఉరి తీయాలి

- ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్
- ర్యాలీలో హిందూ జేఏసీ ప్రతినిధులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని పెంచి ప్రేరేపిస్తున్న పాకిస్థాన్ పీచమణచాలని, పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ముష్కరులను బహిరంగంగా ఉరి తీయాలని హిందూ జేఏసీ ప్రతినిధులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పహల్గామ్ ఘటనకు నిరసనగా హిందూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉగ్రదాడి అమరులకు నివాళులర్పిస్తూ శుక్రవారం స్థానిక కోటిరెడ్డి సర్కిల్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకు శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జాతీయ జెండాతో పాటు జైశ్రీరామ్ నినాదంతో కూడిన కాషాయ జెండాలను చేత పట్టుకుని భారత్ మాతాకీ జై.. జై శ్రీరామ్, పాకిస్థాన్ డౌన్ డౌన్ అంటూ నగర పురవీధులు మార్మోగేలా నినదించారు. ర్యాలీలో మహిళలు, పురుషులు, విద్యార్థులు, యువకులు, నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులంతా కొవ్వొత్తులు చేతపట్టుకుని ఏడురోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో హైందవ ధర్మం చాలా గొప్పదన్నారు. శాంతిని కోరుకునే హిందువులను ఉగ్రవాదులు హతమార్చడం వారి రాక్షసత్వానికి పరాకాష్ట అన్నారు. కార్యక్రమంలో హిందూ జేఏసీ ప్రతినిధులు చిన్మయామిషన్ తురియానందస్వామి, జె.వెంకటసుబ్బారెడ్డి, కందుల మురళీమోహన్‌రెడ్డి, గోసుల శ్రీనివాసులురెడ్డి, మునగా సతీష్ కుమార్‌రెడ్డి, లేబాక నాగమునిరెడ్డి, లేబాక రామమోహన్‌రెడ్డి, బీరం సుబ్బారెడ్డి, బాల కృష్ణయాదవ్ (బీజేపీ) బొమ్మన విజయ్, చాగలమర్రి ఓబులేసు, పవన్‌కుమార్ (బీజేవైఎం) జి.వి.రమణ, సుంకర శ్రీనివాస (జనసేన పార్టీ)తో పాటు పలువురు మాజీ సైనికులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు, వివిధ పాఠశాలల విద్యార్థులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు



ఏడు రోడ్ల కూడలిలో కొవ్వొత్తులతో భారీ మానవహారం

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్

- క్రీడాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- పాఠశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధం



కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల స్థాయి క్రీడలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇక నుంచి ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా కిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. గత ఐదేళ్లలో పాఠశాలలకు క్రీడా కిట్ల పంపిణీలో జాప్యం జరిగింది. దీంతో ఆసక్తి ఉన్న చాలా మంది విద్యార్థులు క్రీడలకు దూరమయ్యారు. గత ఐదేళ్ల పాలనలో చివరి ఏడాది పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లను వైసీపీ ప్రభుత్వం అందించింది. అంతకు మించి పాఠశాలల్లో క్రీడల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వం క్రీడాభివృద్ధిపై దృష్టి సారించింది. పాఠశాలల వారీగా స్పోర్ట్స్ కిట్లు అందించనుంది. ఈ మేరకు వివరాలు కోరుతూ సమగ్ర శిక్ష ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి.

ఇదీ పరిస్థితి

జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1620, ప్రాథమికోన్నత పాఠశాలలు 127, ఉన్నత పాఠశాలలు 236 ఉన్నాయి. విద్యార్థులు 1,39,119 మంది ఉన్నారు. వీరందరికి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, క్రికెట్‌కు సంబంధించి స్పోర్ట్స్ కిట్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏటా స్పోర్ట్స్ కిట్ల పంపిణీ జరిగేది. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనికి బ్రేక్ పడింది. క్రీడా పోటీల నిర్వహణ లేకుండా పోయింది. ఆడుదాం ఆంధ్రా పేరిట హడావుడి తప్ప పాఠశాల స్థాయి క్రీడా పోటీల నిర్వహణపై దృష్టి సారించిన దాఖలాలు లేవు. మరోవైపు పాఠశాల ప్రాంగణాలు సైతం నాడు-నేడు పనులతో అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కనీసం క్రీడా ప్రాంగణాల నిర్వహణ కూడా లేకుండా పోయింది. ప్రాంగణాలన్నీ ఎత్తు పల్లాలుగా మారి ఆడేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. దీంతో గత ఐదేళ్లుగా పాఠశాలల్లో క్రీడలు అన్న మాటే విద్యార్థులు మరచిపోయారు. తాజాగా ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి చర్యలు తీసుకోవడంతో తల్లిదండ్రుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వివరాలు సేకరిస్తున్నాం..



ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. విద్యార్థులకు అవసరమైన స్పోర్ట్స్ కిట్ల కోసం వివరాల ను నమోదు చేస్తున్నాం. ప్రభుత్వం కిట్ల పంపిణీని ప్రారంభించనుంది. త్వరలో జిల్లాలోని అన్ని పాఠశాలలకు కిట్లు అందిస్తాం.

- నిత్యానందరాజులు,
సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్

కోళ్లఫారం యూనిట్ల అభివృద్ధికి దరఖాస్తుల ఆహ్వానం

- పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ

కడప రూరల్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): కడప నగరం ఊటుకూరులో ఉన్న రాష్ట్ర కోళ్ల ఫారంలో మూడు ప్రధాన యూనిట్లను అభివృద్ధి చేసేందుకు ఆసక్తి గల సంస్థలు ఈనెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యూనిట్ల నిర్వహణను పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనరీస్ (పి4) మోడల్‌లో చేపట్టనున్నామని తెలిపారు. ఈ భాగస్వామ్యంలో ప్రైవేట్ సంస్థకు ముందస్తుగా పెట్టుబడి అవసరం లేదని, ఇది సున్నా పెట్టుబడి విధానం (జీరో ఇన్వెస్ట్‌మెంట్ మోడల్) అన్నారు. కానీ నిర్వహణ, బాధ్యత, ఉత్పత్తి పెరుగుదల వంటి అంశాల్లో ప్రైవేట్ సంస్థ నిబంధనలకు కట్టుబడి ఉండాలని సూచించారు. సంస్థ అనుభవం, నిపుణత, ప్రణాళిక, సామర్థ్యం ఆధారంగా ఎంపిక జరుగుతుందని, ఆసక్తి ఉన్న సంస్థలు హెచ్‌టీటీఓఎస్://టెండర్.ఏపీఈప్రొక్యూర్‌మెంట్.జీవోవీ.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

రాజంపేట... సమస్యలు తిష్ఠ

- దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యలు
- నాలుగు వైపులా అధ్వానమైన రోడ్లు
- కనీస అభివృద్ధి లేక అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు




రాజంపేటలో బస్‌స్టాపు లేక ఎర్రటి ఎండలో అలమటిస్తున్న ప్రయాణికులు

రాజంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాజంపేట నియోజకవర్గంలో అనేక దీర్ఘకాలిక సమస్యలున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. అనేక ఏళ్లుగా ఈ సమస్యలు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నా వాటి పరిష్కార మార్గం వైపు నాయకులు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా కడప-రేణిగుంట రాష్ట్ర రహదారిలో ప్రతిరోజూ రోడ్డు ప్రమాదాలు పెరిగిపోయాయి. వాహనాలకు తగ్గట్టు దారి వెడల్పు లేకపోవడంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనివల్ల ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఈ రోడ్డును 4 లేన్లుగా ఏర్పాటు చేసి పునరుద్ధరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం కలగలేదు. ప్రధానంగా ఈ రహదారి రాజంపేట ప్రజలకే కాక కోడూరు, కడప, కమలాపురం ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు, కర్నూలు, బళ్లారి, మహారాష్ట్ర వాసులు తిరుమలకు ఎక్కువగా ఈ రహదారిలోనే వెళుతుంటారు. దీనికి సుమారు రూ.3600 కోట్లు రెండేళ్ల కిందటే మంజూరయ్యాయి. రెండేళ్ల కిందటే ఈ పనులకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. అయితే కోడూరు నుంచి రేణిగుంట వరకు అటవీ మార్గంలో వెళ్లే రహదారికి కేంద్ర ప్రభుత్వం జంగిల్ క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. ఇంతవరకు ఇవ్వకపోవడం వల్ల ఆ రోడ్డు పనులు జరగడం లేదు.

అదేవిధంగా రాజంపేట నుంచి రాయచోటికి, రాజంపేట నుంచి రాపూరుకు వెళ్లే రెండు ఘాట్ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. రాజంపేట నుంచి జిల్లా కేంద్రమైన రాయచోటికి రోడ్డుమార్గం పూర్తిగా పాడై ఉంది. రెండు ఘాట్ అటవీ మార్గంలో వెళ్లే ఈ రహదారికి డబుల్‌లేను కూడా పూర్తి చేయలేదు. రాపూరుకు, నెల్లూరుకు వెళ్లే మార్గంలో అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు డబుల్ లేను రోడ్డు పనులు పూర్తి చేశారు. నెల్లూరు జిల్లా సరిహద్దు నుంచి రాపూరు వరకు రోడ్డును వదిలేశారు. ఘాట్‌రోడ్డులో రోడ్డు వేయకపోవడం వల్ల ఈ మార్గంలో ప్రయాణం చేయడం చాలా కష్టంగా ఉంది.

పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటలో అన్ని రహదారులు ఇరుకిరుకుగా ఉన్నాయి. రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా, పాతబస్టాండు నుంచి మార్కెట్‌కు రావాలన్నా వెడల్పు లేని రోడ్లతో పూర్తిగా రోడ్లన్నీ ఆక్రమణలతో ట్రాఫిక్ ఎక్కువై ఎటూ పోలేని పరిస్థితిలో ఇబ్బందులు పడుతున్నారు. అసలు పట్టణంలో ద్విచక్ర వాహనం పెట్టుకోవాలన్నా ఇబ్బందిగా ఉంది. వెంటనే రాజంపేట పట్టణంలో రోడ్లను వెడల్పు చేయాల్సి ఉంది. ఇక హత్యరాల, తాళ్లపాక, రాజంపేట ప్రాంతాలను అనుసంధానం చేసి చుట్టూ రోడ్డు సౌకర్యాన్ని కల్పించి పుణ్యక్షేత్రాలైన అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాక, పాపవినాసినిగా పేరొందిన హత్యరాల, రాజంపేట ప్రాంతంలో టూరిస్టు హబ్‌గా ఏర్పాటు చేయదలచిన అంశం మరుగునపడిపోయింది. పట్టణానికి ప్రధానంగా చక్రాలమడుగు నది సుందరీకరణ ప్రధానమైనది. పట్టణంలోని మురికినీరు అంతా రాజంపేట పట్టణ నడిబొడ్డున ఉన్న చక్రాలమడుగుకు చేరుతోంది. ఈ నీటిని దిగువ ప్రాంతాలకు పంపి ఆక్రమణలకు గురైన చక్రాలమడుగును సుందరీకరణ చేసి చెట్ల పెంపకాన్ని చేపట్టి పర్యావరణ పరిరక్షణ నిర్వహిస్తే పట్టణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. సుండుపల్లె, వీరబల్లె వాసులకు ప్రధాన సమస్య నీటి సమస్య. కావున వెనువెంటనే ఈ మండలాల్లో చెయ్యేరు నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి పథకాలను పూర్తి చేసి తాగునీటి సౌకర్యాలను మెరుగుపరచాల్సి ఉంది.


నందలూరు చెయ్యేటిలో శిథిలావస్థకు చేరుకున్న రక్షిత మంచినీటి పథకం

అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన తర్వాత ఆ ప్రాజెక్టు మార్గంలో 800 కోట్లతో పునరుద్ధరించాలన్న ప్రాజెక్టు పనులు అక్కడికక్కడే నిలిచిపోయాయి. నిధులు లేని వల్ల ఈ పనులు ఇప్పుడు ప్రారంభించే అవకాశాలు లేవు. దీనికి ప్రయత్నంగా చెయ్యేరు పొడవునా సుమారు 70 కిలోమీటర్ల వ్యవధిలో ఐదు కిలోమీటర్లకు ఒక చెక్‌డ్యాంను ఏర్పాటు చేసి వర్షాకాలంలో నీరు చెక్‌డ్యాంలకు చేర్చి భూగర్భజలాలు పెరిగి సస్యశ్యామలం అవుతుంది. నియోజకవర్గంలో ఒంటిమిట్ట, రాజంపేట, నందలూరు, ప్రాంతాల్లో ఎక్కువ చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిని పునరుద్ధరించి పూడికలు తీసి కాలువలు మరమ్మతులు చేస్తే ఈ నీటి వనరుల ద్వారా తాగునీటి సౌకర్యం ఏర్పడుతుంది. ప్రధానంగా రాజంపేట నుంచి వీరబల్లెకు, సుండుపల్లెకు, సిద్దవటం, ఒంటిమిట్ట, నందలూరు, మండల కేంద్రాల్లోని గ్రామీణ ప్రాంతాలకు సరైన బస్సు సౌకర్యం లేదు. గతంలో రాజంపేట ఆర్టీసీలో 150 బస్సులు ఆర్టీసీవి ఉండగా అవి ఇప్పుడు 70 బస్సులకు కుదించారు. అద్దె బస్సులతోనే పట్టణాలకు బస్సులు నడుపుతున్నారు. పల్లె ప్రాంతీయులు బస్సులు లేక ఆటోలు, మోటారు సైకిళ్లపై ప్రయాణం చేయాల్సి వస్తోంది. కావున అదనపు బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది.

చెరువులు, కాలువలు, కుంటలు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయి. వెంటనే ఈ ఆక్రమణలు తొలగించాల్సి ఉంది. ఈ విధంగా నియోజకవర్గంలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారు. అధికార పార్టీలో ఎమ్మెల్యే లేకపోవడం, ఉన్న నేతల్లో నాయకత్వ పోరు వల్ల తమ రాజకీయ ఉనికికోసమే పోరాడుతున్నారే తప్ప నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించేవారు కరవయ్యారు.


నిధులు లేక నిలిచిపోయిన రాజంపేట-రాయచోటి రోడ్డు పనులు

ఇన్‌చార్జి మంత్రికి విన్నవించాం



రాజంపేట నియోజకవర్గంలోని పలు సమస్యల గురించి అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డికి విజ్ఞాపన పత్రాన్ని అందించాము. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని మంత్రి దృష్టికి తీసుకుపోయాము. రోడ్లు, ఆక్రమణల సమస్య, తదితర అన్ని సమస్యలను మంత్రి దృష్టికి లిఖితపూర్వకంగా విజ్ఞాపన పత్రాన్ని అందించాము. త్వరలో ఈ పనులపై సమీక్షించి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

- ప్రతాప్‌రాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, రాజంపేట

నాలుగు లేన్ల రోడ్లపై కేంద్ర మంత్రితో చర్చించాం

కడప-రేణిగుంట నాలుగులేన్ల రోడ్ల పనులను వెంటనే చేపట్టాలని కోరుతూ కేంద్ర మాజీ మంత్రి పురందేశ్వరి ద్వారా ఇటీవలే ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో చర్చలు జరిపి విజ్ఞాపనపత్రాలను కూడా అందజేశాం. త్వరలో ఫారెస్ట్ క్లియరెన్స్ వచ్చిన వెంటనే పనులు చేపడతామని మంత్రి స్పష్టమైన హామీ ఇచ్చారు. త్వరలో ఈ పనులు ప్రారంభం కానున్నాయి.


నాలుగు లైన్ల రోడ్లపై కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న సాయిలోకేష్ (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



రాజంపేటటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో శుక్రవారం రెడ్డిచర్ల చిన్నప్ప(50) మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... చిన్నప్ప గొర్రెల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇందులో భాగంగా గూడూరులో గొర్రెలను కొని వాటిని సానిపాయిలోని స్వగృహానికి వచ్చే మార్గమధ్యంలో రోళ్లమడుగు సమీపంలో మినీ లారీ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో చిన్నప్ప తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మన్నూరు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. కాగా చిన్నప్పకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గాదెల వీఆర్‌ఏపై దాడి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాదెల గ్రామ పంచాయతీలోని విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ కొత్త పెంచలయ్యను అదే గ్రామానికి చెందిన వ్యక్తి కర్రతో దాడి చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ మహేష్ తెలిపారు. నూకనపల్లె గ్రామ పరిధిలో రెవెన్యూశాఖ రీసర్వే కార్యక్రమంలో విధులు నిర్వహించి తమ సొంత గ్రామమైన గాదెలకు వెళ్లడంతో గ్రామంలో ఉన్న కొత్త మణి అను వ్యక్తి పాతకక్షలు మనసులో పెట్టుకుని దాడి చేయడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అతన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందించారు. పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకొన్నారు. అనంతరం తహసీల్దారు శ్రీధర్‌రావు ఆసుపత్రికి వచ్చి బాధితుడిని పరామర్శించి వీఆర్‌ఏపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐను కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


గాయపడిన వీఆర్‌ఏ పెంచలయ్య

పోస్టాఫీసులో ఆకస్మిక తనిఖీలు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లె పోస్టాఫీసును శుక్రవారం కర్నూలు రీజనల్ పోస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ బీపీ వెంకటరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోస్టల్‌శాఖ ద్వారా అందిస్తున్న సేవలను ప్రజల్లోకి చేరువయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే పొదుపు ఖాతాలు, బీమా పాలసీలు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పోస్టల్ ఏఎస్పీ రామశంకర్, ఇన్‌స్పెక్టర్ జయశంకర్ వెంట ఉన్నారు. కార్యక్రమంలో సబ్‌పోస్టుమాస్టర్ శ్రీనివాసులు, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టాఫీసులో తనిఖీ చేస్తున్న వెంకటరెడ్డి

కమలాపురం కోర్టు ఏజీపీగా శ్రీనివాసులు నియామకం

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా బొలిశెట్టి శ్రీనివాసులును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఆయన ఈ కోర్టులో ప్రభుత్వం తరపున సివిల్ కేసులను వాదిస్తారని ఉత్తర్వులో పేర్కొన్నారు. మూడేళ్లపాటుగానీ ఆలోగా జారీ చేసే ఉత్తర్వుల మేరకుగానీ ఆయన ఏజీపీగా కొనసాగనున్నారు. నెలకు రూ.10 వేల గౌరవ వేతనం చెల్లించనున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శి జి. ప్రభావతి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

గంగమ్మతల్లి జాతరకు పటిష్ట బందోబస్తు

- డ్రోన్ కెమెరాతో జాతర కార్యక్రమాలపై నిఘా
- రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే

రైల్వేకోడూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు గంగమ్మతల్లి జాతర కార్యక్రమాలు ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే తెలిపారు. శుక్రవారం మొదట గంగమ్మతల్లికి పూజలు నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ గంగమ్మజాతర ప్రాంతాలు, దారులు తదితర వాటిని పరిశీలించారు. రైల్వేకోడూరుకు ఎక్కువగా భక్తులు వస్తారు కాబట్టి డ్రోన్ కెమెరాతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జేబు దొంగలపై పటిష్ట నిఘా ఉంటుందన్నారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు తెలిపామన్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈ నెల 29న పోలీసులు రైల్వేకోడూరుకు చేరుకుంటారని ఏఎస్పీ తెలిపారు. జాతరలో ఎలాంటి సమస్య వచ్చినా అందుకు నిర్వాహకులే బాధ్యులుగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడా చిన్న పొరపాటు కూడా జరగకుండా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు సీఐ కే.హేమసుందరరావు, ఎస్‌ఐ నవీన్‌బాబు, జాతర కమిటీ ఛైర్మన్ రాంబాబు, కమిటీ సభ్యులు పోకల సుబ్బరాయుడు, పంద్రా పెద్దోడు, పోతురాజు నవీన్, పోతురాజు సుమన్, ఉంగరాల చంద్ర, చెన్నంశెట్టి సుబ్బా, కదిరి సాయి, ఉంగరాల సాయి, యెలిశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.


గంగమ్మతల్లికి పూజలు చేస్తున్న ఏఎస్పీ

కేసుల్లో పురోగతి సాధించాలి

కేసుల్లో పురోగతి సాధించాలని రాజంపేట ఏఎస్పీ మనోజ్‌రామనాథ్‌హెగ్డే తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఆయన పలు కేసులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కేసులను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులను ఆదేశించామన్నారు. సీఐ కె.హేమసుందరరావు, ఎస్‌ఐ జి.నవీన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ భూముల కాలుష్యంపై ఆర్డీవో విచారణ


ఎర్రగుంట్ల, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ చిలంకూరులోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో శుక్రవారం పర్యటించారు. ఇటీవల ఫ్యాక్టరీపై జరుగుతున్న దుమారం, వివాదం చినికిచినికి గాలివానలా మారుతోంది. గతంలో ఫ్యాక్టరీకి 2200 ఎకరాల భూములు తీసుకున్నారు. అయితే ఇటీవల ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి యాజమాన్యానికి మధ్య వివాదం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఐసీఎల్ చుట్టూ ఉన్న భూముల్లో పంటలు పండించుకోలేక పోతున్నామని, ఐసీయల్ నుంచి వచ్చే కాలుష్యం తీవ్రంగా ఉందని, కలమల్ల గేటు వద్ద రోడ్లు నాశనమయ్యాయని, సమీప గ్రామాలకు ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని, గతంలో ఉన్న స్కూల్స్ మూసివేశారని, వైద్యం అందించం లేదన్న విమర్శలున్నాయి. బ్లాస్టింగ్‌తో ఇళ్లు, భూముల్లో పగుళ్లు వచ్చాయని, తమకు ఉపాధి కల్పించడం లేదని, వీటిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదులు రావడంతో ఆయన ఆర్డీవోను విచారణకు పంపినట్లు తెలిసింది. ఆర్డీవోను కలిసిన రైతులు, ఎంపీటీసీలు కూడా ఆర్డీవోకు తమ సమస్యలను వివరించారు. అయితే విలేకరులకు, స్థానిక భూములు కోల్పోయిన వారికి సమాచారం ఇవ్వకుండా ఈ విచారణ చేశారు. స్థానికంగా ఉన్న ఎంపీటీసీ నవీన్‌కుమార్, బీజేపీ నాయకుడు సత్యం స్వామి, కొందరు రైతులతో ఆర్డీవో మాట్లాడారు. అనంతరం యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. కాలుష్య నివారణ మండలి అధికారులతో కలిసి ఆమె కాలుష్యాన్ని పరిశీలించారు. ఈ విచారణ అనంతరం పూర్తి నివేదికను కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు సమాచారం. ఈ విషయంపై తహసీల్దార్ శోభన్ బాబును వివరణ అడుగగా ఆర్డీవో చిలమకూరు అల్ట్రాటెక్‌లో అధికారులతో, కొందరు రైతులతో మాట్లాడారని తెలిపారు.


ఐసీయల్ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో, పక్కనే తహసీల్దార్ శోభన్‌బాబు

ఉపాధి పనుల్లో రూ.20 లక్షలు దుర్వినియోగం

- ఏపీవోపై ఎంపీపీ ఆగ్రహం

పుల్లంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): 'మీ ఇష్టం వచ్చినట్లు ఉపాధి పనులు జరుగుతున్నాయి. లక్షలాది రూపాయలు దుర్వినియోగమవుతున్నాయి. ఏసీ రూములో కూర్చొని ఏమి చేస్తున్నావ్? మీ వాటా ఎంత? టీఏ వాటా ఎంత? ఈసీ ఎంత అంటూ ఏపీవో శ్రీనివాసులుపై మండల అధ్యక్షుడు ముద్దా బాబుల్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మండలంలో జరిగిన ఉపాధి అక్రమాలపై ఆధారాలతో సహా ఎంపీపీ అధికారులకు సూచించారు. మండలంలోని వత్తలూరు పంచాయతీలో జనాభా 4250 కాగా అక్కడ పనిచేసే కూలీలు వెయ్యి మంది. ఇది సాధ్యమా ? 150 మంది కూలీలు వస్తే వెయ్యి మంది పేర్లు నాలుగైదు మస్టర్లలో ఒకే ఫొటోలు, కాని కూలీల పేర్లు మాత్రం వేరు. మస్టర్‌లో ఉన్న ఫొటోల్లో ఒక గ్రామానికి చెందినవారు ఉంటే కూలీలు పేర్లు మాత్రం మరో గ్రామానికి చెందినవారివి ఉన్నాయని, దీనిపై సమాధానం చెప్పాలని ఎంపీపీ ఏపీవోను నిలదీశారు. తిప్పాయపల్లె పంచాయతీలో రౌడీషీటర్ క్రిమినల్‌గా ఉన్న వ్యక్తిగా మేట్‌గా ఎలా పనిచేస్తారు. మండలంలో 21 పంచాయతీల్లో మొత్తం కూలీలు 3029 మంది. ఒక వత్తలూరు పంచాయతీలో వెయ్యి మంది కూలీలు 20 లక్షలకు పైగా దుర్వినియోగమైంది. అనంతసముద్రం పంచాయతీలో కక్షలు, ఘర్షణలకు వీరు ఆజ్యం పోస్తున్నారంటూ ఏపీవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఏపీవో శ్రీనివాసులు సభలో మట్లాడుతూ గత ఐదేళ్లుగా ఇలానే జరుగుతుందని చెప్పడంతో తమ ప్రభుత్వంలోనే చర్యలు తీసుకోవాలని ఎన్నోసార్లు చెప్పా అంటూ ఎంపీపీ సభకు వివరించారు. పుల్లంపేట మండలంలో 176 గ్రామాలు ఉండగా ప్రతి గ్రామంలో 2 నుంచి 4 బెల్ట్ షాపులు ఉన్నాయని, ఒక్కో బాటిల్‌పై రూ.80 అదనంగా వసూలు చేస్తున్నారని, దీనిపై ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. శ్మశాన స్థలం ప్రహరీ కూల్చివేత, బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ సీఐ పాత్ర, ఉపాధి అక్రమాలపై జిల్లా కలెక్టర్‌కు ఉపాధి హామీ పీడీకి, ఎక్సైజ్ కమిషనర్‌కు తీర్మానం చేసి పంపాలని, ఎంపీపీ ఎంపీడీవో వరప్రసాద్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు అరవిందకిషోర్, మండల ఉపాధ్యక్షుడు బోగా వెంకటసుబ్బరత్నమ్మ, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.


ఉపాధి అక్రమాలపై ఆధారాలు చూపిస్తున్న ఎంపీపీ

పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఆర్‌వో మధుసూదన రావు


పాలిటెక్నిక్ ప్రవేశపరీక్షపై సమీక్షిస్తున్న డీఆర్‌వో మధుసూదనరావు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్‌వో మధుసూదన రావు తెలిపారు. తన చాంబర్‌లో శుక్రవారం ఆయన ప్రవేశ పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 30న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఎటువంటి పొరపాట్లు జరగకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు తాగునీరు ఏర్పాటు చేయాలని మునిసిపాలిటీ వారిని, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని తహసీల్దార్లను ఆదేశించారు. గ్రామీణ విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా రవాణా సౌకర్యం కల్పించాలని రవాణా శాఖాధికారులను ఆదేశించారు. హెల్త్ టీమ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు ఎదురుకాకుండా చూడాలని వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆదేశించారు. పరీక్ష పూర్తయ్యేంత వరకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. సమావేశంలో రాయచోటి, రాజంపేట, మదనపల్లె, కలికిరి పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

పులివెందుల వైద్య కళాశాల ప్రొఫెసర్ రిటైర్‌మెంట్‌కు అనుమతి

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలలో సోషల్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ డి.శంకర్‌రెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వ్యక్తిగత కారణాలతో ఆయన రాజీనామా చేసిన 2024 జూలై 29 నుంచి ఈ రాజీనామా అమల్లోకి వచ్చినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి.హోస్‌మణి శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసరుకు పదోన్నతి

కలికిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ వ్యక్తిగత సహాయకురాలిగా పనిచేస్తున్న ఫారెస్టు సెక్షన్ ఆఫీసరు ఓ.రష్మీ మణికి డిప్యూటీ రేంజరుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను రాజంపేట రేంజి తుమ్మలబయలు సెక్షను డిప్యూటీ రేంజి ఆఫీసరుగా నియమించింది. అయితే, రష్మీ మణి ఎమ్మెల్యే పీఏగా కొనసాగుతారని, ఆ మేరకు అన్నమయ్య జిల్లా కలెక్టరు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.వి.శేషగిరిబాబు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

తొమ్మిది మంది బైండోవర్

రామసముద్రం, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 9 మంది సారా, కర్ణాటక మద్యం అక్రమ అమ్మకాల నిందితులు పార్వతమ్మ, సునీల్‌బాబు, భానుప్రకాష్, పవిత్ర, మంగమ్మ, వెంకటరమణ, మంజుల, రవిలను శుక్రవారం స్థానిక తహసీల్దార్ నిర్మలాదేవి ముందు బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జబావుల్లా తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ రికార్డులు స్వాధీనం

పెద్దతిప్పసముద్రం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్లపల్లె పంచాయతీ రికార్డులను శుక్రవారం డీఎల్‌పీవో నాగరాజు స్వాధీనం చేసుకున్నారు. చేపలవేలం డబ్బు విషయంపై పోతుపేట సర్పంచ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో డీఎల్‌పీవో ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు బూర్లపల్లె ఇంచార్జ్ కార్యదర్శి విష్ణు తెలిపారు.

రయ్ రయ్ మంటూ...



- మైనర్ల ర్యాష్ డ్రైవింగ్ ● ప్రమాదాల బారిన యువత
- ఎదుటి వారి ప్రాణాలు మీదకు తెస్తున్న వైనం
- కౌన్సెలింగ్‌తో వదిలేస్తున్న పోలీసులు
- తల్లిదండ్రుల్లో కనిపించని మార్పు

వాళ్లది తెలిసీ తెలియని వయసు.. రోడ్డుపై ఎలా వెళితే ఏం జరుగుతుందో తెలియదు.. ట్రాఫిక్ నిబంధనలు అస్సలు తెలియవు.. వీరికి బైకు దొరికితే అడ్డూ అదుపు ఏముంటుంది.. రోడ్లపై ఇష్టానుసారం డ్రైవింగ్ చేస్తూ.. వారు ప్రమాదాలకు గురికావడమే కాకుండా ఎదుటి వారి ప్రాణాల మీదకు తెస్తున్నారు. వీళ్లు పోలీసుల తనిఖీలో పట్టుబడుతున్నా.. చర్యలు చేపడితే భవిష్యత్ నాశనం అవుతుందనే ఉద్దేశ్యంతో కౌన్సెలింగ్ చేసి వదిలి పెడుతున్నారు. దీన్ని అలుసుగా తీసుకున్న కొంతమంది యువత రెచ్చిపోతున్నారు.

కడప క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివార్లలో రకరకాల బైకులతో వీళ్లు స్టంట్లు చేస్తూ కనిపిస్తున్నారు. ఒక్కో బైకులో ఒకరిద్దరు కాదు ఏకంగా ముగ్గురు, నలుగురు కూర్చుని వెళుతూ ప్రమాదాల బారినపడి విలువైన ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు జరుగుతున్నాయి. 18 ఏళ్ల నిండని మైనర్లు రయ్ మంటూ రాకెట్ వేగంతో రోడ్లపై దూసుకెళుతున్నారు. ఎక్కువగా స్కూటీలు, బైకులపై వెళుతూ కనిపిస్తున్నారు. ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులు కళాశాలలకు ద్విచక్రవాహనాల్లో వెళుతున్నారు. కొన్ని కళాశాలల్లో వీళ్లకు అనుమతులు ఉండవు. అయినా కొందరు నేరుగా కళాశాలకు బైకులతో వెళుతున్నారు. ఒక్కో బైకులో ముగ్గురు లేదా నలుగురు కలిసి వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వీళ్ల ప్రధాన రహదారులే కాకుండా సందు గొందుల్లో కూడా వేగంగా వెళుతూ పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఇక 9, 10 తరగతులు చదువు



తున్న విద్యార్థులు సైతం బైకులు నడపు తున్నా రు. ఇలాంటి వారు పోలీసుల తనిఖీలో పట్టుబ డుతున్నా... కౌన్సెలింగ్ చేసి వదిలేస్తున్నారు. దీన్ని అలుసుగా తీసుకొని రెచ్చిపోతున్నారు.

తల్లిదండ్రుల్లో బాధ్యత కరువు

తమ పిల్లలు మారాం చేశారనే, అలిగారనో లేక కొంత మంది తల్లిదండ్రులు వారికి బైకులు కొనిపిస్తున్నారు. 18 ఏళ్ల నిండకుండానే బైకులు నడపడం, లైసెన్సు కానీ, ఆర్సీ కానీ పొందలేరు. దీంతో కుటుంబ సభ్యుల పేరుతో బైకులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. దీంతో మైనర్లకు ట్రాఫిక్ ఆంక్షలపై అవగాహన లేకపోవడంతో వాహనలను అదుపు చేసే సామర్థ్యం ఉండకపోవడంతో అతివేగం, నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేస్తున్నారు. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి వాళ్ల పోలీసుల తనిఖీల్లో పట్టుబడితే తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. మళ్లీ పిల్లలకు వాహనాలు ఇచ్చి పంపుతుండడం గమనార్హం. ఇప్పటికైనా మైనర్ల డ్రైవింగ్‌పై పోలీసులు కాస్త కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు.



ప్రత్యేక నిఘా ఉంచాం



మైనర్ల డ్రైవింగ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టాం. కడప నగరంలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో ఉదయం, సాయంత్రం వేళ వాహన తనిఖీలు చేపడుతున్నాం. మైనర్లు పట్టుబడితే మొదట కౌన్సిలింగ్ చేయడంతో పాటు వారి తల్లిదండ్రులను కూడా పిలిపించి హెచ్చరిస్తున్నాం. రెండోసారి, మూడోసారి ఇలాగే జరిగితే మాత్రం చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

-జావేద్, కడప ట్రాఫిక్ సీఐ

రీ సర్వే సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదు

- ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజక వ ర్గంలో రీసర్వేలో భాగంగా తలెత్తిన చిన్న చిన్న భూ సమస్యలను పరి ష్కరించకుండా రెవెన్యూ అధికారులు కాలయాపన చేయడం తగదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. రైతాంగం శ్రేయ స్సును దృష్టిలో పెట్టుకొని మానవతా దృక్పథంతో పరిష్కరించాలని కోరారు. శుక్రవారం ఉదయం ఆయన తన ఇంటి వద్ద విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలోని రైతాం గం రీసర్వే కారణంగా ఆన్‌లైన్‌లో భూమి వివరాలు లేకపోవడం, 1బీలు తదితరవి రాక మనోవేదనకు గురవుతు న్నారన్నారు. ముఖ్యంగా తొండూరు, చక్రాయపేట మండలాల్లో పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. తొండూరు మండలం లోని భద్రంపల్లె పొలంలో 171 సర్వే నెంబర్‌లో 13.48 ఎకరాల భూమిలో ఆరుగురు రైతులు ఉన్నారన్నారు. ఇందులో రీసర్వే సందర్భంగా 40సెంట్ల భూమి అధికంగా చూపిస్తోందన్నారు. ఏ రైతు ఏ అభ్యంతరం చెప్పకపోయినా 2023 నుంచి ఇప్పటి వరకు ఆ సమస్యను పరిష్కరించకుండా అట్లే వదిలేశార న్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌ల దృష్టికి తీసుకెళ్లగా.. వారు కింది స్థాయి రెవెన్యూ అధికారుల కు చెప్పినా పరిష్కరించలేదన్నారు. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించామన్నారు. అందుకు రీసర్వే పూర్తయ్యే వరకు పాత రికార్డుల ప్రకారమే ఆన్‌లైన్‌లో 1బీలు వచ్చేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. అయినా ఆన్‌లైన్‌లో వివరాలు చూపడం లేదన్నారు. తొండూరు మండ లంలో ఏడు గ్రామాలకు సంబంధించిన భూముల వివరాలు ఆన్‌లైన్‌లో చూపడం లేదన్నారు. రెవెన్యూ అధికారులు మే చివరి నాటికి రైతాంగ సమస్యలను పరిష్కరించకపోతే బాధిత రైతులతో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తామన్నారు. టీడీపీ నాయకులు మైసూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

22 బైకులు స్వాధీనం

కొండాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంక య్యకాలువ గ్రామం లో జిల్లా ఎస్పీ ఆదే శాల మేరకు శుక్ర వారం పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వ హించారు. ఈ సం దర్భంగా గ్రామంలో ఇంటింటిని పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలోని అను మానిత ప్రదేశాల్లోనూ విస్తృతంగా తని ఖీలు నిర్వహించా రు. ఈసందర్భంగా పత్రాలులేని 22 బైకు లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామసభను నిర్వ హించి.. కొండా పురం సీఐ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఏవైనా చిన్న చిన్న సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. లేనిపోని గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. ముద్దనూరు, ఎర్రగుంట్ల సీఐలు దస్తగిరి, నరేష్, కొండా పురం, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐలు ప్రతాప్‌రెడ్డి, హృషి కేశ్వర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


బైకులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఎన్‌హెచ్ 440 రోడ్డు పనుల తనిఖీ


అనిమెలలో నేషనల్ హైవే పనులను తనిఖీ చేస్తున్న జేసీ

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-చాగలమర్రి నేషనల్ హైవే 440 పనులను జాయింట్ కలె క్టర్ అదితిసింగ్ తనిఖీ చేశారు. శుక్రవారం ఆర్డీఓ చెన్న య్య, తహసీల్దార్ లక్ష్మీదేవితో కలిసి జేసీ తనిఖీ చేశారు. అనిమెల రెవెన్యూ గ్రామంలో రోడ్డు నిర్మాణంలో భాగంగా కట్టడాలు, భవనాలు, బోర్లు తదితర వివరాలను తెలుసుకొని అభ్యంతరాలను ఆరా తీశారు.

ఆలం సుబ్బరాయుడు మృతి


ఆలం సుబ్బరాయుడు (ఫైల్)

కడప, యర్రముక్కపల్లి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరి ప్రసాద్ బావ (చెల్లెలి భర్త) ఆలం సుబ్బ రాయుడు (69) శుక్రవారం సాయం త్రం 3.00 గంటలకు కడప నగరం రవి థియే టర్ దగ్గర గల వారి స్వగృహంలో మృతి చెం దారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమా రుడు కలరు. పెద్ద కుమార్తె బెంగుళూరు, రెండవ కుమార్తె జర్మనీలో, కుమారుడు ఫ్రాన్స్‌లో ఉన్నారు. సుబ్బరాయుడు అసిస్టెంట్ సోషియల్ వెల్ఫేర్ ఆఫీసర్‌గా పదవీ విరమణ పొందారు. వీరి స్వగ్రామం అన్నమయ్య జిల్లా కోడూరు తాలుక పెనగలూరు మండలంలోని వెలగచర్ల. సుబ్బరా యుడు అంత్యక్రియలు శనివారం ఉదయం 8.30 గంట లకు కడప నగరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద గల శ్మశాన వాటి కలో నిర్వహించనున్నట్లు హరిప్రసాద్ తెలిపారు. సుబ్బ రాయుడు భౌతిక కాయాన్ని ప్రభుత్వ ఉన్నత ఉద్యోగులు, తోటి విశ్రాంత ఉద్యోగులు, పలువురు రాజకీయ నాయ కులు సందర్శించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష

కడప క్రైం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి మోటరుసైకిలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డ వ్యక్తికి 14రోజుల పాటు జైలుశిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ కడప ఫస్ట్‌క్లాస్ స్పెషల్ కోర్టు తీర్పు ఇచ్చింది. పాలెంపల్లె ఆరోగ్యస్వామి అనే వ్యక్తి గురువారం మద్యం తాగి మోట రు సైకిలు నడుపుతూ కడప ట్రాఫిక్ పోలీసులకు పట్టుబ డ్డాడు. ట్రాఫిక్ సీఐ జావీద్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా, శుక్రవారం జడ్జి పైవిధంగా తీర్పు నిచ్చినట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చకండి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను మార్కుల యంత్రాలుగా మార్చ కూడదని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయ కులు బి.లక్ష్మీరాజా తెలిపారు. శుక్రవారం ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు - మార్కుల యంత్రాలు-విలువలు అనే అంశం పై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించా రు. ఈ సమావేశంలో బి.లక్ష్మీరాజా, ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుద ర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విశాఖపట్నం ఇంజనీ రింగ్ కళాశాల అధ్యాపకురాలిపై ఓ విద్యార్థి చెప్పుతో దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండి స్తున్నామన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత విద్యార్థుల తల్లిదండ్రులపైన, సమాజంపై, ఉపాధ్యాయ, అధ్యాపకులపై ఉందన్నారు. యూటీఎఫ్ 1938 జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ డి.కృష్ణారెడ్డి, నరసింహులు, రవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీరాజా

లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌కు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): లైసెన్స్ టెక్నికల్ పర్సన్ అర్హత పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనరు రాముడు తెలిపారు. ఏపీలోని పురపరిపాలన మరియు పట్టణాభి వృద్ధిశాఖ ఆదేశాల మేరకు పులివెందుల పురపాలక సంఘం పరిధిలో కొత్తగా లైసెన్సు టెక్నికల్ పర్సన్స్ లైసెన్స్ పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ లైసెన్సు ద్వారా అభ్య ర్థులు మున్సిపల్ పరిపాలన శాఖకు సంబంధించిన డీపీఎంఎస్ ద్వారా ప్రజలకు ఆన్‌లైన్‌లో భవన/లేఅవుట్ నిర్మాణ అనుమతుల కోసం అవ సరమైన సాంకేతిక సేవలను అందించగలుగుతారన్నారు మూడేళ్ల ఆర్కి టెక్చర్ అసిస్టెంట్ లేదా ఇంటర్ ఇన్ ఆర్కిటెక్చర్ రెండేళ్ల అనుభవం లేదా డిప్లమా ఇన్ సివిల్ ఇంజనీరింగ్‌తో పాటు డిగ్రీ ఇన్ ఆర్కిటెక్చర్ /డిప్లమా లేదా డిగ్రీ ఇన్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ తదితర అర్హతలు కలిగి ఉండి ఆసక్తి కలిగిన అభ్యర్థులు క్వాలిఫికేషన్ సర్టిఫికెట్, నిర్ణీత రుసుము చెల్లించి మీ దగ్గరలో ఉన్న సచివాలయంలో లేదా మున్సిపల్ కార్యాలయంలోని టౌన్ ప్లానింగ్ విభాగంలో మీ దరఖాస్తును సమర్పిం చాలని తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయుడి నేత్రదానం

పులివెందుల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పట్టణం జొన్న వెంకటయ్య వీధికి చెందిన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు రెంటా చిన్న పుల్లయ్య (76) మరణించడంతో ఆయన కుటుంబసభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. ఈమేరకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ, స్నేహిత అమృ త హస్తంసేవా సమితి నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో మృతుని నివాసం వద్దకు వెళ్లి పార్థివ దేహం నుంచి కార్నియాలను సేకరించి హైదరాబాదులోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు.

నీటి కొరత లేకుండా చూడాలి : ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో ఎక్కడా కానీ నీటి కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శుక్రవారం సభాభవనంలో జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా నగర పంచాయతీ పరిధిలోని మెయిన్ రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు రూ.77లక్షలతో సీసీరోడ్లు, 30 లక్షలకు తాగునీటి పైపులైన్లుకు శంకుస్థాపన చేశారు. ఎన్టీఆర్ సుజల స్రవంతి, తాగునీటికి నూతన వాటర్‌ప్లాంటును ప్రారంభించారు. కమలాపురం నగర పంచాయతీకి కొత్తగా స్వచ్ఛ భారత్ కోసం క్లీన్ అండ్‌గ్రీన్ రూ.24లక్షలతో గార్‌బేజ్‌కు పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఇంకా సామాజిక ఆరోగ్య కేంద్రం కమ్యూనిటీ హెల్త్ హాస్పిటల్ డెవలప్‌మెంటు కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో సభాభవనం జరుగుతన్న సమావేశంలో మాట్లాడారు. ప్రతి పంచాయతీలో తాగునీరు కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నకేశవరెడ్డి, జడ్పీటీసీ సుమిత్ర రాజశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ కెజియా, ఏపీయం గంగాధర్, ఏపీవో పార్థసారధి, ఎంఈవోలు బేబీ సుహాసిని, నగర పంచాయతీ కమిషనరు జగన్నాథం, టీడీపీ నాయకులు వాసుదేవరెడ్డి, నాగిరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి, కంకర సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, జంపాల నరసింహారెడ్డి, దాదిరామయ్య, రెడ్డికరీం, పల్లె రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'మైనార్టీ, దళితులపై దాడులు చేస్తే ఉద్యమిస్తాం'

కడప మారుతీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగం నడుపుతూ అమాయక మైనార్టీ, దళితులపై దాడులకు తెగబడుతోందని, ఇదే తరహాలో సాగితే ఉద్యమానికి సన్నద్ధం అవుతామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథరెడ్డి హెచ్చరించారు. దళిత ఫోరం వ్యవస్థాపకుడు బి. కిశోర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో పలువురు దళిత, క్రిస్టియన్, మైనార్టీ నాయకులు, మతపెద్దలు పాల్గొని ఆయా వర్గాలపై ఇటీవల జరిగిన దాడులను తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో పలువురు మత గురువులు, వైసీపీ రాష్ట్రనాయకులు పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, నాయకులు వినోద్‌కుమార్, శ్యాంసన్, రత్నకుమారి, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మోడల్ ప్రైమరీ స్కూల్ విద్యాబోధనను సద్వినియోగం చేసుకోండి

సింహాద్రిపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ మోడల్ ప్రైమరీ స్కూల్ వారి విద్యా బోధనను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం నూతనంగా సింహాద్రిపురంలో 2025- 26 విద్యా సంవత్సరం నుంచి ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూల్‌లో 1నుంచి 5వ తరగతి వరకు అధ్యాపక బృందంచే విద్యా బోధన చేయడం జరుగుతుందన్నారు. అడ్మిషన్లు ప్రారంభ మయ్యాయి. ఉపాధి శ్రామికులు, డ్వాక్రా పొదుపు సంఘాల మహిళలు తమ పిల్లలను మన ప్రభుత్వం నిర్వహిస్తున్న మోడల్ స్కూల్‌లో చేర్పేలా చూడాలని ఎంపీడీఓ కృష్ణమూర్తి కోరారు.

భూరికార్డు స్వచ్ఛీకరణకు రైతులు సహకరించాలి

లింగాల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): భూరికార్డు స్వచ్ఛీకరణకు రైతులు సహకరించాలని తహసీల్దార్ ఈశ్వరయ్య అన్నారు. లింగాల మండలం చిన్నకుడాల గ్రామంలో భూరీసర్వే కార్యక్రమంపై శుక్రవారం అవగాహనర్యాలీ నిర్వహించారు. ఆయన మాటట్లాడుతూ వెబ్‌ల్యాండ్‌లో కుటుంబీకుల పేర్లు, భూకొనుగోలుదారుల పేర్లు మార్పు కోసం ప్రత్యేకంగా ఐదుగురురెవెన్యూ అధికారులను నియమించామని తెలిపారు.

ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

పెండ్లిమర్రి, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించి,కిండర్ గార్డెన్స్ వేసుకోవాలని మంచి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందరికీ అందించాలని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం ఖరీఫ్ ప్రణాళిక 2025-26 పై వ్యవసాయ,వెలుగు,ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఓ ఓబులేసు,ఏపీయం బాలస్వామి,టీమ్ లీడర్ సందీప్ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలని కమలాపురం ఏడీఏ నరసింహారెడ్డి సూచించారు. శుక్రవారం ఏవో శ్యామ్‌బాబుతో కలిసి కీర్తిపల్లె గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ఇంతియాజ్, రైతులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా ఆక్రమించారు.!

జోరుగా రోడ్డుమార్జిన్‌లు ఆక్రమణలు ● వేలల్లో అద్దెలు వసూళ్లు ●విజయమ్మ కాంప్లెక్స్ ఎదురు సర్వీసు రోడ్డు మాయం ఫుట్‌పాత్‌లనూ వదలని వైనం ● పట్టించుకోని మున్సిపాలిటీ యంత్రాంగం



విజయమ్మ కాంప్లెక్స్ ఎదురుగా ఆక్రమణకు గురైన సర్వీసు రోడ్డు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో పలు ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. స్థానిక షాపుల యాజమానులే ఫుట్‌పాత్, మురుగు కాల్వలపై అమ్మకాలు, చిరువ్యాపారులకు అద్దెలకు కేటాయిస్తూ వేలకు వేలు దండుకుంటున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా ఉంటూ కబ్జాలకు కొందరు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపాలిటీ అధికారులు కన్నెత్తి చూడడంలేదు. కాసుల మత్తులో జోగాడు తున్న యంత్రాంగానికి ఆక్రమణలు ఆదాయ వనరులుగా మారిపోతున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో స్థలాలు, ఫుట్‌పాత్‌లు అన్యాక్రాంతానికి గురవుతున్నాయి. ఇప్పటికే పలు మున్సిపాలిటీకి చెందిన కొన్ని స్థలాలు కొందరు ఆక్రమించి వేసి ఏళ్ల తరబడి అనుభవిస్తుండగా, నిర్మాణాలు తొలగించి స్వాధీనం చేసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు.

సర్వీసు రోడ్డు మాయం..: స్థానిక విజయమ్మ కాంప్లెక్స్ ఎదురుగా ఆక్రమణలతో ఏకంగా సర్వీసు రోడ్డునే మాయం అయింది. ప్రధాన రోడ్డు అయిన ఆంజనేయస్వామి గుడి వెళ్లేందుకు ఈ సర్వీసు రోడ్డు ఉంది. కానీ తోపుడుబండ్లతో ఆక్రమణకు గురైంది. ఈ ప్రాంతమంతా చిన్న చిన్న వ్యాపారు లకు మంచి డిమాండ్ ఉండడంతో అక్కడి యజమానులు సైతం రోడ్డు స్థలాన్ని అద్దెలకు కేటాయించారు. దీంతో అక్కడ రోడ్డు ఉన్న సంగతే ప్రజలకు తెలియకపోగా టిఫిన్ బండ్లు, ఫ్రూట్స్ బండ్లు ఇలా ఒకటేమిటి అన్ని రకాల వ్యాపారులతో ఆ ప్రాంత మంతా రద్దీగా మారింది. దీంతో చిరువ్యాపారులు కూడా రోజూ వందల్లో అద్దెలు చెల్లించుకోవాల్సి వస్తుంది. అధికారులు మాత్రం చూసీచూడనట్లు ఉంటుండడంతో ఇష్టారాజ్యంగా మారింది.

వేలల్లో దోపిడీ..: పట్టణంలో వేల సంఖ్యలో వీధి వ్యాపారులు వివిధ రకాల విక్రయాలతో జీవనం సాగిస్తున్నారు. అధిక శాతం తోపుడుబండ్లు, ఫుట్‌పాత్‌లపై పండ్లు, కూరగాయలు, టిఫిన్, టీ, దుస్తులు, చెప్పులు, వివిధ వస్తువులు, నూడిల్స్ పాయింట్లు, సమోసాలు, పూలవ్యాపారం వంటివి అమ్మకాలు సాగిస్తున్నారు. ఈ వ్యాపారాలు సాగించేందుకు ప్రతిరోజూ ఆయా మున్సిపాలిటీ వారికి రోజువారి రుసుం చెల్లించాల్సి ఉంది. ట్రాఫిక్ సమస్య తలెత్తినప్పుడల్లా ఖాకీలు తమ ప్రతాపం చూపించి వారి బండ్లను పక్కకు నెట్టివేయడం నిత్య కృత్యమైంది. దీంతో వ్యాపారులు షాపుల యజమా నులను ఆశ్రయించడంతో వారి దుకాణం ముందు సాయంత్రం బండిని నిలుపుకుని చిరువ్యాపారాలు చేసుకుంటున్నారు. యజమానులు వారి వద్ద నుంచి రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు వసూలు చేయడం ఇదో తరహా వ్యాపారమైంది. అంతేకాకుండా యజమానులు తమ షాపు ముందు వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించినందుకు రోజూ రూ.500 వరకు వసూలు చేస్తున్నారు.

దీంతో చిరువ్యాపారుల వద్ద నుంచి నెలకు రూ.13వేల నుంచి రూ.15వేల వరకు వసూలు చేస్తున్న వారు అధికంగా ఉన్నారు. బతుకుదెరువు కోసం బండి నడుపుకుంటున్న చిరువ్యాపారులు తమ సంపాదన ఎంత వచ్చినా కచ్చితంగా ఏరోజుకారోజు రూ.500 వరకు చెల్లించు కోవాల్సి వస్తుందని వెల్లడిస్తున్నారు.

ఆధారాలు ఉన్నా..: పట్టణంలో వందల సంఖ్యలో ప్రభుత్వ రహదారులు ఖాళీ స్థలాల్లో శాశ్వత ఆక్రమణలు జరిగినట్లు ఆధారాలున్నాయి. వివిధ వ్యాపారుల నిమిత్తం మరెన్నో తాత్కాలిక ఆక్రమ ణలు చేశారు. తొలుత చిరువ్యాపారం కోసం కొంత మేర జాగా ఏర్పాటు చేసుకోవడం, ఆ తరువాత శాశ్వత కట్టడాలు నిర్మించేస్తున్నారు. ప్రధానంగా మున్సిపల్ కాంప్లెక్స్‌లలో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి ఆక్రమణలకు గురైన స్థలాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





శ్రీరామ హాలు రూట్‌లో ఆక్రమణకు గురైన రోడ్డు, బోలే వార్డులో ఫుట్‌పాత్‌పై హోటళ్లు

చర్యలు తీసుకుంటాం



పులివెందుల పట్టణంలో ఎక్కడైె ఆక్రమణలు గురైన స్థలాలు గుర్తించి చర్యలు తీసుకుంటాం, అంతే కాకుండా ఫుట్‌పాత్‌లు ఆక్ర మించిన వ్యాపా రస్తులతో మాట్లాడి ఆక్రమణలు తొలగింప జేస్తాం. పూర్తిస్థాయిలో ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం.

రాముడు, మున్సిపల్ కమిషనరు

అవగాహనతోనే మలేరియా వ్యాధి నిర్మూలన



చెన్నూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చెన్నూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచాన్ని గతంలో వణికించిన మలేరియా వ్యాధిని నిర్మూలించాలంటే మొదట దోమల నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి చెన్నారెడ్డి అన్నారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా చెన్నూరులో వ్యాధి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కలిగేలా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాగరకుమారి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: జాతీయ మలేరియా నివారణ దినం సందర్భంగా శుక్రవారం నందిమండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యుడు వినయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడేగా తొట్లు,డ్రమ్ములు,టైర్స్, కూలర్స్ శుభ్రం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజశేఖర్, రామ ప్రతాప్,సిబ్బంది మార్గరేట్, రవీంద్రనాథ్,వెంకట సుబ్బమ్మ,సుబ్బయ్య, అంజన,జయకుమారి, సంధ్య,రేవతి, మేరి, వసంత,స్వరూప,సుహాసిని,రేణుక పాల్గొన్నారు.

లింగాల..: మలేరియా రాకుండా నివారించడం ప్రజలందరి బాధ్యత అని లింగాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సుభాషిణి అన్నారు. లింగాలలో శుక్రవారం ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా మలేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులివెందుల సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లె..: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని డాక్టర్ పృథ్వీరెడ్డి తెలిపారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా తాళ్లపల్లెలో ర్యాలీ నిర్వహించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీని ఆదాయ మార్గంలో నడపాలి

ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు

చెన్నూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలకు ఆదాయ మార్గాలను తీసుకువచ్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు అన్నారు. చెన్నూరులో శుక్రవారం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద సీకేదిన్నెమండల పంచాయతీ కార్యదర్శులకు గ్రామ పంచాయతీల్లో ఘన వ్యర్థాలు నిర్వహణపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీకేదిన్నె ఈవోఆర్‌డి సుబ్బారెడ్డి, రిసోర్స్‌పర్సన్లు గురువేశ్వర్‌రావు, రాజవర్ధిని, సర్పంచ్ వెంకటసుబ్బయ్య కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, శివకుమార్రెడ్డితోపాటు సీకేదిన్నె కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే కాన్పులు చేయాలి

వల్లూరు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు నిర్వహించాలని డీపీ డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వల్లూరులో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి నందు ఆశావర్కర్లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కాన్పులను ప్రభుత్వ ఆసు పత్రిలో చేసే విధంగా గర్భిణీలకు వివరించాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రిజిస్టర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్, హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నష్టపరిహారం చెల్లించి పనులు చేసుకోండి'

చక్రాయపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-వేంపల్లె జాతీయ రహదారి పనుల్లో భాగంగా నాగులగుట్టపల్లెలో శుక్ర వారం రోడ్డు వెడల్పు కోసం చక్రాయపేట తహసీల్దార్ విజయ కుమారి అక్కడకు వెళ్లారు. గతంలో పలుమార్లు రోడ్డు వెడల్పు కోసం భూమిలో ఉన్నవి తొలగించుకోవాలని ప్రజలకు తెలిపారు. శుక్రవారం రోడ్డు కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, తహసీల్దార్‌తో పాటు పోలీసులు అక్కడకు వెళ్లారు. ప్రజలు అడ్డుకున్నారు. నష్టపరి హారం ఇచ్చి తొలగించాలని తెలిపారు. అందుకు స్పందించిన తహసీల్దార్ ఇది ప్రభుత్వ భూమి అన్నారు. పట్టాభూములు ఉంటే నష్టపరిహారం వస్తుందని అన్నారు. దీంతో ప్రజలు వేంపల్లె, గండి, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాలలో ఇళ్లుపోయిన వారికి డబ్బులు కట్టించారు. మాకు కూడా చెల్లించాలని అధికారులను నిలదీశారు. తహసీల్దార్ వారం రోజులు గడువు ఇస్తూ రాతపూర్వకంగా రాయించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామచంద్రారెడ్డి, మెడికల్ స్టోర్ ఆంజనేయులు, ప్రసాద్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు కులగణనపై రౌండ్ టేబుల్ సమావేశం

కడప నాగరాజుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓబీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ (బీయుఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 26వ తేదీన ఉదయం 10గంటలకు వైఎస్సార్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే జనగణనలో కుల గణన చేపట్టాలని ఏర్పాటుచేసిన రౌండ్‌టేబుల్ సమావేశాన్ని జయ ప్రదం చేయాలని బీయూఎన్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం.ఓబులేసు యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీయూఎన్‌ఎఫ్ నాయకులు రాము, శ్రీనివాసులు, నవీన్, శివ, మనోజ్, ఉదయ్, వేణు పాల్గొన్నారు.

నేటి ర్యాలీని జయప్రదం చేయండి

కడపనాగరాజుపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్ పహల్గాంలో ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని ఐక్యవేదిక నాయకులు కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం 5గంటలకు స్టేట్ గెస్ట్‌హౌస్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకుర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేధావులు, అభ్యుదయ వాదులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనర్లు, పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి, డాక్టర్ రాజా వెంగల్‌రెడ్డి, లక్ష్మీరాజా, డాక్టర్ ఫరూక్ ఇలియాస్ బాష,చంద్రశేఖర్, రవశంకర్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

సమ్మర్ ఉర్దూ ఫ్రీ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ ఉర్దూ ఫ్రీ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అజుమన్ తరక్కి ప్రతినిధులు కోరారు. శుక్రవారం ఉర్దూ భాషాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో అంజుమన్ కార్యాలయం ఉర్దూ ఫ్రీ కోచింగ్ తెలుగు, ఉర్దూ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అజుమన్ ప్రెసిడెంట్ సత్తార్ ఫైజీ, జనరల్ సెక్రటరీ హిదాయతుల్లా, ముస్లిం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బంగ్లేషావలి దర్గా ఉరుసు

కడప కల్చరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): నగర గండి వాటర్ వర్క్స్ వద్ద ఉత్తర దిశ ఏటి గడ్డపై వెలసిన బంగ్లేషా వలి దర్గా ఉరుసు మహోత్సవం ఈనెల 26వ తేదీ శనివారం జరుగనుంది. కడప అమీన్‌పీర్ దర్గా పీఠాధిపతి ఇంటి నుంచి మేళతాళాలతో నగర పురవీధుల గుండా గంధం వాటర్ గండికి చేరుకోనుంది. రాత్రి 7 గంటలకు గంధం, 8 గంటలకు అన్నప్రసాద కార్యక్రమం, అలాగే 9 గంటలకు ఖవ్వాలి ప్రత్యేక కార్యక్రమం వుంటుంది.

ఉగ్రవాదాన్ని రూపుమాపాలి





కడప... దిష్టిబొమ్మ దహనంలో జనసేననాయకుడు తుంగా రమణయ్య, వేములలో కొవ్వొత్తుల ర్యాలీ

కడప మారుతీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్ సుందర పహల్గాం అందాలను తిలకిస్తూ ఆస్వాదిస్తున్న హిందువులను తుపాకులతో హతమార్చిన పాకిస్థాన్ ఉగ్రవాదులను తుదముట్టించాలని జనసేన నాయకుడు జి.వి. రమణ కేంద్రప్రభుత్వాన్ని కోరారు. ముష్కర ఉగ్రమూక దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి కన్నీటి నివాళి అర్పిస్తూ జనసేన ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కృష్ణా థియేటర్ వద్ద ఉన్న శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో మానవహారం నిర్వహిం చారు. అనంతరం ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం చేసి మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గజ్జల సాయిస్వరూప్, తుంగా రమణయ్య, రంజిత్, తోట సుమన్, రవీంద్రబాబు, విజయ్, శ్రీకాంత్, భరత్, సిద్ధు, తేజ, బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కడప సెవెన్‌రోడ్స్..: పహల్గాం ప్రాంతంల్లో అతి కిరాతకంగా దుర్మార్గంగా ఉగ్రవాదులు చంపేయడాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి మనోహర్, శ్రీనివాసులరెడ్డి, లక్ష్మీదేవి సంయుక్త ప్రకటన లో ఖండించారు. కేంద్ర,రాష్ట్రప్రభుత్వాలు ఉగ్రవాదుల ను అణిచివేయడానికి గట్టి కృషి చేయాలని కోరారు.

కమలాపురం రూరల్..: టూరిస్టులను కాల్చి చంపడం దుర్మార్గమైన చర్య అని పెద్ద దర్గా పీఠాధిపతి గఫార్ షా ఖాద్రీ అన్నారు. ముష్కరుల దాడిని ఖండించారు. శుక్రవారం జమ్ము కశ్మీర్ పహల్గంలో పర్యాటకులపై ముష్కరులు చేసిన దాడిని కమలాపురం పెద్ద దర్గా పీఠాధిపతులు గఫార్‌షాఖాద్రీ, పీఠాధిపతి సోదరులు దస్తగిరి, మౌలానా, ఇస్మాయిల్ ఖండించారు. దర్గా ప్రాంగణంలోని మసీదులో నమాజ్ చేసి అనంతరం నల్లబ్యాడ్జీలు ధరించి దర్గా ఎదురుగా రోడ్డుపై మానవ హారంతో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ముస్లింలు పాల్గొన్నారు.

వేముల..: ఉగ్రవాదాన్ని రూపుమాపాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి అన్నారు. ఉగ్ర వాదుల చేతుల్లో మరణించిన వారికి, వారి కుటుం బాలకు సానుభూతి తెలుపుతూ శుక్రవారం మండల కేంద్రమైన వేములలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పేర్ల శేషారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు కూనపూరి రాములు, భాస్కర్ రెడ్డి, సత్యమా రెడ్డి, రమణ, బాష, కుంటి బాష, షాలీం ఖాన్, గంగా. దర్‌రెడ్డి, దుగ్గన్నగారిపల్లె గంగాధరరెడ్డి, అమ్మయ్య గారిపల్లె విశ్వనాథరెడ్డి, కొత్తపల్లె పుల్లారెడ్డి, చాగలేరు భాస్కర్‌రెడ్డి, స్కూల్ కమిటీ ఛైర్మన్ వెంకటేష్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు

పులివెందుల రూరల్..: కశ్మీర్‌లో ఉగ్రమూకల దాడిలో మరణించిన వారికి నివాళులు అర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం మండలంలోని నల్లపు రెడ్డిపల్లె గ్రామంలో గ్రామ ప్రజలు డిష్ వెంకటరెడ్డి, పాపయ్య తదితరులు కొవ్వొత్తులు చేతబట్టి సంతాపం వ్యక్తం చేశారు.

కడప కలెక్టరేట్..: కశ్మీర్ పహల్గామ్‌లో పర్యాట కులపై జరిగిన ఉగ్రవాదులను కేంద్రం పూర్తిగా అణచి వేయాలని,ఉగ్ర వాదాన్ని ప్రోత్సహిస్తున్న ఉగ్ర దేశంగా ప్రపంచ దేశాలు ప్రకటించాలనీ ముస్లిం నేతలు ఖాదర్‌బాషా,ఆరీఫ్, రఫీ,శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని పెద్ద దర్గా, మేకల దొడ్డి వద్ద గల జేకేయూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాకిస్థాన్ జండాలను కాల్చి నిరసనలు చేశారు.



కమలాపురం...నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న పీఠాధిపతులు

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తా



ఆర్‌వీ కొండారెడ్డి
ఎస్‌ఐ, పోరుమామిళ్ల

ముఖాముఖి

పోరుమామిళ్ల , ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల మండలంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానని పోరుమామిళ్ల ఎస్‌ఐ ఆర్‌వీ కొండారెడ్డి పేర్కొన్నారు. పస్తుతం ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రశ్న: ట్రాఫిక్ నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రతిరోజూ ఉదయం. సాయంత్రం పోలీసుసిబ్బందితో ఏఎస్‌ఐ , నలుగురు కానిస్టేబుళ్లతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూసుకుంటున్నాం. పార్కింగ్ రోడ్డు విస్తరణ జాప్యం కారణంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

ప్రశ్న: పోరుమామిళ్లలో ఎన్నిసీసీ కెమెరాలున్నాయి. ఎన్ని పనిచేస్తున్నాయి?

జవాబు:పోరుమామిళ్లలో 21 సీసీకెమెరాలున్నాయి. 15 సీసీ కెమెరాలు పని చేస్తున్నాయి. మిగిలినవి పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న:క్రికెట్ బెట్టింగ్, జూదం నియంత్రణపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జవాబు:జూదం ఆడేవారిపై కేసులు కడుతున్నాం, ప్రజల నుంచి కూడా సహకారం ఇచ్చి సమాచారం అందిస్తే క్రికెట్ బెట్టింగ్‌లపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సైబర్ నేరాల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు:ప్రభుత్వ కళాశాలల్లో, గ్రామాల్లో సైబర్ నేరాల కట్టడికి అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

ప్రశ్న:బెల్టుషాపుల నిర్వహించే వారిపై చర్యలేంటి?

జవాబు: బెల్టుషాపులు నిర్వహించే వారిపై కేసులు పెడుతున్నాం. గతంలో బెల్టుషాపులు నిర్వహించే వారికి కౌన్సిలింగ్ చేసి తహసీల్దారు వద్ద బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నాం.

ఉగ్రవాదాన్ని తుదముట్టించాలి

● పహల్గాం దాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసనలు ● ఉగ్రదాడి పిరికిపంద చర్య ● పలు సంఘాలు, పార్టీల నేతల ధ్వజం



బద్వేలులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ ఎంఎల్‌పార్టీ నాయకులు



జమ్మలమడుగులో నిర్వహిస్తున్న శాంతి ర్యాలీ



ప్రొద్దుటూరు శివాలయం సర్కిల్లో కొవ్వొత్తులతో నిరసన చేపట్టిన ముస్లింలు

బద్వేలు/రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే భారతీయుల లక్ష్యంగా ముందుకు సాగాలని పలు సంఘాలు, పార్టీల నేతలు పిలుపునిచ్చారు. కాశ్మీర్‌లోని పహల్గాంలో నిరాయుధ పర్యాటలపై జరిగిన ఉగ్రదాడిని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం పట్టణంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య మాట్లాడుతూ ఉగ్రవాదులు దాడిచేసి 26 మందిని చంపడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు చంద్రశేఖర్, చంద్రమోహన్‌రాజు, జకరయ్య పాల్గొన్నారు. ఉగ్రవాదులు హిందువులపై జరిపిన దాడి పిరికిపంద చర్య అని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీరశేఖర్ పేర్కొ న్నారు. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని పొట్టనపెట్టుకోవడం హేయమైన చర్య అని సీపీఐ మండల కార్యదర్శి నాగదాసరి ఇమ్మా నుయేల్, జిల్లా సమితి సభ్యుడు పడిగ వెంకట రమణలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుబ్బారెడ్డి, సుధాకర్, బ్రహ్మయ్య, రాజశేఖర్, ప్రసాద్, వెంకటేశ్, వీరయ్య మునెమ్మ, దేవి, అయ్యవారమ్మ పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో అశువులుబాసిన అమాయక ప్రజల ఆత్మలకు శాంతి చేకూరాలని జమ్మలమడుగు కన్నెలూరులో శాంతి ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఉగ్రవాదం అంతమొందాలని ర్యాలీలో పాస్టర్లు, ముస్లింలు తదితరులు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదం నశించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కన్నెలూరు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: కశ్మీర్‌లో టూరిస్టులపై కాల్పులు జరిపిన ఉగ్రవాదులకు ఉరిశిక్ష వేయాలని సీపీఎం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద కాశ్మీర్‌లో ఉగ్రవాద కాల్పుల్లో వీరమరణం పొందిన భారత ముద్దుబిడ్డలకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు గౌసియాబేగం, మేరీ బేబి, ఓబులమ్మ, రహ్మత్‌బీ, దస్తగిరమ్మ, హుసేనమ్మ పాల్గొన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాద దాడుల్లో మృతి చెందిన వారికి జనసేన, బీజేపీ, హ్యూమన్‌రైట్స్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శుక్రవారం రాత్రి స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వద్ద జనసేన నాయకులు రామాయణపు రామ్మోహన్, నగరి రామయ్య, హ్యూమన్ రైట్స్ నాయకుడు ఫణిరావు, బీజేపీ నాయకులు పల్లంశెట్టి పండరి వెంకటసుబ్బయ్య తదితరులు మానవహారంగా ఏర్పడి నివాళులర్పించారు.

దువ్వూరులో: ఉగ్రదాడులను నిరశిస్తూ దువ్వూరులో ముస్లింలు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అమాయకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను తరిమివేయాలని కోరారు. మరణించిన వారికోసం మౌనం పాటించారు. కార్యక్రమంలో మత పెద్దలు మౌలానా అబ్దుల్‌కరీం, ఇమామ్‌సాహెబ్, ఆరీఫ్‌హుస్సేన్, ముస్లింలు పాల్గొన్నారు.

ఉగ్రదాడులతో సమైఖ్యతను దెబ్బతీయలేరు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్‌లోని పెహల్గావ్‌లో యాత్రికులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక మారణకాండతో దేశ సమైఖ్యతను దెబ్బతీయలేరని అంజుమన్ అహలే ఇస్లాం మాజీ అధ్యక్షుడు వీఎస్ ముక్తియార్ పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి అంజుమన్ అహలే ఇస్లాం ఆధ్వర్యంలో స్థానిక శివాలయం సర్కిల్లో పెహల్గావ్ మృతులకు కొవ్వొత్తులతో ముస్లింలు పెద్ద ఎత్తున సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో ఇస్లాంపురం, మదీనా, నజురుల్లాషా, మోడంపల్లి, దర్గా, ఖాదర్ హుస్సేన్, జామీయా, మక్కా, మహమ్మదీయ మసీదు కమిటీల ముస్లిం మత పెద్దలు మాజీ సైనికులు బీసీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టెన్త్‌లో రాయలసీమ విద్యార్థుల ప్రతిభ



ఎండీ షాహిద్ | లాస్య | చరణ్

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక గవిని సర్కిల్‌లోని రాయలసీమ విద్యార్థులు 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచారని ఆ పాఠశాల హెచ్‌ఎం అనిత తెలిపారు. ఎండీ షాహిద్ 600కు 589, లాస్య 581, చరణ్ 578 మార్కులు సాధించారని తెలిపారు. పరీక్షలు రాసిన విద్యార్థులందరు ఉత్తమ మార్కులు సాధించారని, ప్రతిభ కనపరిచిన విద్యార్థులను పాఠశాల నిర్వాహకులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

చంద్రబాబు మెప్పుకోసమే జగన్‌పై విమర్శలు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మెప్పుకోసం జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తరచూ మాజీ సీఎం జగన్‌పై స్థాయికి మించి విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఘాటుగా విమర్శించారు. శుక్రవారం జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముందుగా జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లో జరిగిన ఘోర ఘటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ నీవు, నీ అనుచరులు అక్రమ సంపాదన, దోపిడీలు, బెదిరింపులతో జమ్మలమడుగు నియోజకవర్గ ప్రజలు ఇప్పటికే విసుగు చెందారన్నారు. పచ్చిక పుల్లరీ భూముల్లో ఆది అనుచరుల అధికారాన్ని అడ్డుపెట్టుకుని సోలార్ పనులు చేస్తూ ఆ ప్రాంత రైతులకు మోసం చేయడం కాదా అన్నారు. భవిష్యత్తులో ఆదినారాయణరెడ్డికి ప్రజలే రాజకీయ సమాధి కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు నిర్మాణాలు జరిగేలా చర్యలు

● ఓపెన్ ఫోరమ్ సమావేశంలో మున్సిపల్ కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ మల్లికార్జున

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో జరిగే ఏ నిర్మాణామైన టౌన్‌ప్లానింగ్ నిబంధనల మేరకు జరిగేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున వెల్లడించారు. శుక్ర వారం స్థానిక మున్సిపల్ సభా భవనంలో సచివాలయ వార్డుప్లానింగ్ సెక్రటరీలు మున్సిపల్ లైసెన్స్‌డ్ బిల్డింగ్ ప్లానర్‌లతో నూతన టౌన్‌ప్లానింగ్ జీవోపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ అక్రమ కట్టడాలకు టీడీఆర్ బాండ్స్ ద్వారా రెగ్యులర్ చేయవచ్చని తద్వారా ప్రభుత్వానికి నిధులు కూడా సమకూరతాయన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు విస్తరణ చేయకముందే ఇంటి యజమానులకు బిల్డర్స్‌కు అవగాహన కల్పించాలన్నారు. అలాగే ఈ జీవోలో ఎల్‌టీపీలకు ఉన్న అభ్యంతరాలు సమస్యలపై కూడా చర్చించవచ్చని బిల్డర్స్‌ను ఈ ఓపెన్ ఫోరం సమావేశంకు తీసుకురావాలన్నారు. సమావేశంలో ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్‌లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

పోరుమామిళ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అవసరమైతే మండల గ్రాంటు ఖర్చు చేసేందుకు సిద్దంగా ఉన్నామని మండలాధ్యక్షురాలు తహసీన్ అన్నారు. శుక్రవారం పోరుమామిళ్లలోని స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో అధికారులు పర్యటించి ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తుతుందో వాటిని ముందుగానే గుర్తించి తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు. ఎంపీడీవో రమణారెడ్డి మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి కలెక్టరు నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ మాట్లాడుతూ మల్లకతవను సర్వే చేసి హద్దులు కేటాయిస్తే సుందరీకరణగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, రంగసముద్రం సర్పంచ్ చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దారు కెజియా, రాజశేఖర్, అల్లా, పుల్లీడు సర్పంచ్ రఘునాధరెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల నాకాబందీ



పెన్నా నగర్ ఈశ్వర్ రెడ్డినగర్‌లో నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) ప్రొద్దుటూరు వన్‌టౌన్ పరిధిలోని పెన్నానగర్ ఈశ్వర్‌రెడ్డినగర్ ఏరియాల్లో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాసులు, సంజీవరెడ్డిల ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నాకాబందీ నిర్వహించారు. ఈసందర్భంగా పలుచోట్ల తనిఖీలు చేపట్టారు. బైపాస్‌రోడ్డులో వాహనాలు తనిఖీ చేసి రికార్డులు లేని వాహనాలు పట్టుకున్నారు. అసాంఘిక నేరాలకు పాల్పడినా సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రేపు 'స్పందన' సుబ్బరామిరెడ్డి సంతాప సభ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యావరణవేత్త స్పందన సుబ్బరామిరెడ్డి సంతాప సభను ఆదివారం నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు ఐక్య వేదిక అధ్యక్షుడు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, కార్యదర్శి టీవీ సురేష్‌లు పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు అరవింద ఆశ్రమంలో ఆయన సంతాప సభ జరుగుతుందని, పట్టణంలోని స్వచ్ఛంద సేవా సంస్థలు, పట్టణ ప్రజలు పాల్గొని సంస్మరణ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురికూటి సూర్యనారాయణరెడ్డి, శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, గజ్జల వెంకటేశ్వరరెడ్డి, విష్ణునారాయణ, కాశీప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత పిచ్చినాయుడు మృతి పార్టీకి తీరని లోటు

ఖాజీపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు సారె పిచ్చినాయుడు (60) మృతిచెందడం పార్టీకి తీరని లోటని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి అన్నారు. పిచ్చినాయుడు మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న వెంటనే ఆయన పత్తూరు గ్రామానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. 1983 నుంచి పార్టీకోసం పిచ్చినాయుడు అహర్నిశలు కృషి చేసి క్యాన్సర్ వ్యాధితో మృతిచెందడం బాధాకరమన్నారు. పత్తూరు పంచాయతీ అభివృద్ధికోసం అహర్నిశలు కష్టపడడంతో పాటు పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. అలాగే వైసీపీ నాయకులు కూడా పలువురు మృతదేహానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. టీడీపీ నాయకులు కొండపేట కేసీకెనాల్ చైర్మన్ రవి, హరినాధరెడ్డి, సుబ్బయ్య టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారి సన్నిధిలో అధికారులు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాలజ్ఞాన కర్త వీర బ్రహ్మేంద్రస్వామి వారిని శుక్రవారం ఢిల్లీ అడిషనల్ డైరెక్టర్ సుభాష్ చంద్ర మాలిక్, కడప అసిస్టెంటు డైరెక్టర్ శ్రీనివాసరావు దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫిట్ పర్సన్ శంకరబాలాజీ, మేనేజరు ఈశ్వరయ్యాచారి పాల్గొన్నారు.

ఘనంగా గూడుమస్తాన్‌వలి గంధం



దర్గాలో పాతెహాలు చేస్తున్న భక్తులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పెన్నానది వడ్డున వెలసిన హజరత్ సయ్యద్‌షా గూడుమస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఘనంగా గంధపు ఉత్సవం జరిగింది. ఈ సందర్భంగా రాత్రి ఎస్.హాజీబాష, మహబూబ్‌వారి ఇంటి నుంచి దర్గాకు గంధం చేర్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కులమతాలకు అతీతంగా భక్తులు దర్గాలో ప్రత్యేక పాతెహాలు చేసి మొక్కులు చెల్లించి మొక్కుకున్నారు. అలాగే జామియా మసీదు పీఠాధిపతి షాదిక్‌పాషా ఖాద్రి పక్కీర్లతో మెరువణిగా చాదర్‌ను దర్గాకు చేర్చి పాతెహాలు చేశారు. ఆయన వెంట ఆయన శిష్యులతోపాటు భక్తులు, పక్కీర్లు పాల్గొన్నారు.

సబ్సిడరీ రుణాలపై దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలంలోని ఎస్సీ కులాలకు చెందిన లబ్ధిదారులు బ్యాంకు అనుసంధానంతో సబ్సిడీతో కూడిన రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన లబ్ధిదారులు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా మే 10వ తేదీ వరకు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. స్వయం ఉపాధి పథకాలు అయిన మెడికల్ షాపు, ల్యాబ్, ఎలక్ట్రికల్ బ్యాటరీ చార్జింగ్ యూనిట్, ఎలక్ట్రికల్ ఆటో, ప్యాసింజర్ కారు, సోలార్ ఎనర్జీ ప్రొడెక్షన్, తదితర వాటికి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. దరఖాస్తుదారులు వయోపరిమితి 21 నుంచి 50 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, కుల, ఆదాయ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని వివరించారు.

మలేరియా అంతం మనతోనే సాధ్యం



బద్వేలులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ చేపట్టిన వైద్యాధికారులు

బద్వేలు/ప్రొద్దుటూరు, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యో తి): మలేరియాను అంతం చేయ డం మనతోనే సాధ్యమవుతుంద ని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వినయ్ కుమార్, సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డిలు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భం గా స్థానిక ఎన్‌జీవో హోం నుం చి నాలుగురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంత రం వారు మాట్లాడుతూ ప్రపం చ మలేరియా దినోత్సవం ఏప్రి ల్ 25న ప్రపంచ వ్యాపంగా డ్రైడే కార్య్రకమాన్ని నిర్వహిస్తా రని తెలిపారు. దోమల నివార ణకు కూలర్లు, ట్యాంక్‌లో వంటి వాటిలో నీరు నిల్వ ఉంచరాదన్నారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ శ్రీనివాసులు, డాక్టర్ శరత్ చంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య,హెల్త్ ఆఫీసర్ శివరామిరెడ్డి , ఏఎన్‌ం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. దోమల నిర్మూలన మన అందరి బాధ్యత అని ప్రొద్దుటూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శివప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక శ్రీరాములపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మలేరియా రాకుండా ఉండాలంటే దోమ లు పుట్టకుండా ఉండాలన్నారు ఇంటితో పాటు ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. దోమల కాటునుంచి తప్పించుకోవడానికి దోమతెరలు వినియోగించాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికా రులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ పద్మిని, డాక్టర్ మోహన్‌కాంత్, హెల్త్ హెడ్యూకేటర్ వెంకటేశ్వర్లు , సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, శోభారాణి, సీవోలు సుబ్బారెడ్డి నాగజ్యోతి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు రూరల్‌లో: ప్రజల సహకారంతోనే మలేరి యా నిర్మూలన సాధ్యమని ప్రొద్దుటూరు మలేరియా సబ్‌యూనిట్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మలేరియా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కామనూరు, శంకరాపురం, గోపవరం, జిన్నానగర్, తదితర ప్రాంతాల్లో వైద్యాధికారులు డాక్టర్ హనీఫ్‌బాబా, డాక్టర్ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది, ప్రజలతో కలిసి ర్యాలీ, అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. పొట్టిపాడు రోడ్డులో ఉన్న బాలుర సాంఘిక సంక్షేమ శాఖలో మలేరియాపై వక్తృత్వ పోటీలను నిర్వహించి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ పీహెచ్‌వో కృష్ణమ్మ, సూపర్‌వైజర్లు బీఏ వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మెడికల్ సూపరింటెండెంట్ రఫీక్‌పాషా, సబ్‌యూనిట్ ఆఫీసర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైద్య అధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో మలేరియా అంతం చేయవచ్చన్నారు. జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు కన్నెలూరు ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దువ్వూరులో: మలేరియాను అరికడుదామని, ఇందుకు అందరి సహకారం అవసరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు సురేష్‌బాబు, హేమలత అన్నారు. దువ్వూరులో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి దువ్వూరు మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చాపాడులో: చాపాడు, నక్కలదిన్నె గ్రామాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ డాక్టర్ రాజేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు వారి ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్లు ఓబులేసు, శ్రీవాణి, కావ్య, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, సూపర్‌వైజర్లు బాబురెడ్డి, సరస్వతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరులో: ఇంటి పరిసరాలను దోమలు చేరకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు.ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఎల్‌ఎం కాంపౌండ్, 6 వ వార్డులో మలేరియా నిర్మూలన పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున, ల్యాబ్‌టెక్నీషియన్ జాసన్, ఆరోగ్య విస్తర్ణ అధికారి శ్రీనివాసులరెడ్డి ,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు రూరల్‌లో: మలేరియాను గుర్తించి సకాలంలో వైద్య సేవలు పొంది ప్రాణాలను కాపాడుకోవాలని జీవి సత్రం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సుధ తెలిపారు. శుక్రవారం మలేరియా దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమాలు కుట్టకుండా దోమతెరలు, మస్కిటో కాయిన్స్, పొడవాటి దుస్తులు ధరించాలని తెలిపారు.

బి.మఠంలో మూడు మోడల్ పాఠశాలల ఏర్పాటు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండలంలోని కంది మల్లయ్యపల్లె, పెద్దిరాజుపల్లె, రేకలకుంట్ల గ్రామాల్లో ఉండే ప్రాథమిక పాఠశాలలను మోడల్ పాఠశాలలుగా చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని మాజీ మండల అధ్యక్షులు మాలేపాటి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా మాలేపాటి సుబ్బారావు మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని ఆయన తెలిపారు. అలాగే మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌కు మాజీ మండలాధ్యక్షుడు మాలేపాటి సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనపరచిన బ్రాహ్మణ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తామని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కంబగిరిరావు, కార్యదర్శి చంద్రశేఖర్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన విద్యార్థులు, ఇతర ప్రాంతాల్లో చదివిన వారు పట్టణంలోని విద్యాసంస్థలలో చదివిన ఇతర ప్రాంత విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించి ఉంటే నగదు పురస్కారాలు అందజేస్తామన్నారు. 95 శాతంపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు మే 4వ తేదీ బ్రాహ్మణ సేవా సంఘం కార్యాలయంలో ప్రముఖుల చేతుల మీదుగా నగదు పురస్కారాలు అందజేస్తామని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 27వ తేదీ లోపు బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

పోరుమామిళ్లకు రూ.200 కోట్లు కేటాయించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

పోరుమామిళ్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి) : పోరుమామిళ్ల పట్టణాబివృద్ధికి రూ.200 కోట్లు నిధులు కేటాయించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, కేశవ, జాకోబ్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎంపీడీవోకు, అధికారులకు వారొక వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరుమామిళ్ల పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం బ్రహ్మంసాగర్ నుంచి పైపు లైను ద్వారా నీరందించాలన్నారు. పోరుమామిళ్ల, రంగసముద్రం పంచాయతీల్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు విస్తరణ పనులు అర్థాంతరంగా ఆగిపోయిన, దీంతో ప్రజలు ట్రాఫిక్ సమస్య ఎక్కువైందన్నారు. పోరుమామిళ్లలో ఎవరైన చనిపోతే పాతిపెట్టడానికి శ్మశానవాటిక గ్రామానికి దూరంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదెకరాల స్థలం శ్మశానా నికి కేటాయించాలన్నారు.

ప్రభుత్వ భూముల్లో అక్రమ విద్యుత్ సర్వీసులపై విచారణ

కాశినాయన ఏప్రిల్25(ఆంధ్రజ్యోతి):నాయనపల్లె సమీపంలోని సర్వేనెంబర్ 128,129 (1)130లలోని కొండ పొరంబోకు భూముల్లో ఏర్పాటుచేసిన విద్యుత్ సర్వీస్‌లను శుక్రవారం పరిశీలించినట్లు మండల ట్రాన్స్‌కో ఏఈ రవీంద్రకుమార్ తెలిపారు. ఇటీవల పైసర్వే నెంబర్‌లల్లో భూ ఆక్రమణదారులు దొడ్డిదారిలో జలకళ బోర్లు వేసి అక్రమంగా వాటికి విద్యుత్ లైన్లు ఏర్పాటుచేసినట్లు వెలుగులోకి వచ్చాయి. దీంతో స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేసి నివేదికను రెవెన్యూ అధికారులకు ,ట్రాన్స్‌కో ఉన్నతాధికారులకు పంపినట్లు ఏఈ తెలిపారు.

29 న కొండాపురం మండల సమావేశం

కొండాపురం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఉదయం 10-30 గంటలకు ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగే సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని తెలిపారు.